# అభ్యుదయం

RNI: TEL TEL /2019/12836

*The Pride of Telugu national daily*





**Wanted Reporters**

తెలుగు రాష్ట్రాల్లో
నియోజక వర్గాల వారిగా
విలేఖరులు కావలెను

తెలంగాణ :- 9700026263
ఆంధ్రప్రదేశ్:- 9885426263



పబ్లిషర్ :ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ ఆదివారం 06- 9- 2026 సంపుటి : 6 సంచిక : 211 ఎడిటర్ : ఆనంద్ రావు పేజీలు : 8 వెల : 3-00


## ఎస్సీ, ఎస్టీలపై అట్రాసిటీ కేసుల్లో వేగంగా విచారణ

- పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి
- ఎస్సీ, ఎస్టీల ఆర్థిక సాధికారతకు సమగ్ర కార్యాచరణ
- ఏజెన్సీ ప్రాంతాల్లో అవకాశాలు కాదు... అవగాహన లేకే వెనుకబాటుతనం
- ఎస్సీ, ఎస్టీ హైపవర్ కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

2లో



### కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత

## రైతులకుమళ్లీ పాత రోజులు

- 24 గంటల కరెంట్ ఇస్తామన్న రేవంత్‌రెడ్డి
- కేసీఆర్ ఇచ్చిన దాంట్లో సగం కూడా ఇస్తలేదు
- ఇప్పుడేమంటవ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి?
- వైఫల్యాల నుంచి డైవర్షన్‌కే ఎదురుదాడి
- రైతులకు వెంటనే 24గంటల విద్యుత్తు ఇవ్వాలి లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు చేస్తాం
- బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు

సిద్దిపేట, సెప్టెంబర్ 5
**అభ్యుదయం**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు సరఫరా చేసే విద్యుత్తు పరిస్థితి మళ్లీ పాత రోజులకు చేరిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయానికి 24గంటల ఉచిత విద్యుత్తు అందించామని, అయితే కేసీఆర్ కంటే మెరుగ్గా ఇస్తామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి ప్రస్తుతం రైతులకు 10గంటలు కూడా సక్రమంగా



ఇవ్వడం లేదని, అందుకు సిద్దిపేట జిల్లా గంభీర్‌పూర్ సబ్‌స్టేషన్ లాగ్‌బుక్కే సాక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

మిగతా 2లో

# 264 ఎకరాల్లో భారీ ప్రాజెక్ట్...

- దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్
- హైదరాబాద్‌లో టీసీఎస్ రూ.70వేల కోట్ల పెట్టుబడి
- గ్రీన్ ఎనర్జీ, వాటర్-న్యూట్రల్ డిజైన్‌తో క్యాంపస్
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కీలక సమావేశం
- దేశానికే ఇది చారిత్రాత్మక ప్రాజెక్టు: సిఎం రేవంత్



హైదరాబాద్, **అభ్యుదయం**
హైదరాబాద్‌లో భారీ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు టీసీఎస్ అనుబంధ సంస్థ హైపర్‌వాల్ట్ ఏకంగా రూ.70,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్ట్‌తో వేలాది మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉండటంతో పాటు, హైదరాబాద్‌కు గ్లోబల్ ఏఐ రంగంలో మరింత కీలక స్థానం దక్కనుంది. పీటీఐ కథనం ప్రకారం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) అనుబంధ సంస్థ హైపర్‌వాల్ట్ హైదరాబాద్‌లో 264 ఎకరాల భూమిని దక్కించుకున్నట్లు శనివారం ప్రకటించింది. ఇక్కడ భారీ స్థాయిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) డేటా సెంటర్ క్యాంపస్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్ట్ కోసం హైపర్‌వాల్ట్, దాని భాగస్వాములు కలిసి రూ.70,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నారు.

మిగతా 2లో

## కాంగ్రెస్ ప్రభుత్వం భూదందా సాగిస్తోంది

- 2ఏతో ప్రజల భూములను లాక్కునే కుట్ర
- కేసీఆర్ ప్రభుత్వం బాటలో రేవంత్ కూడా..
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

హైదరాబాద్, **అభ్యుదయం**
సామాన్యుల ఆస్తులు, రైతుల పొలాలను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం భూదందా సాగిస్తోందని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు విమర్శించారు.

22ఏ నిషిద్ధ జాబితా పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల సొంత భూములను లాక్కునేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నాయకత్వంలో ఈరోజు జరిగిన మహాధర్నాకు ఆయన హాజరయ్యారు. ఈ



సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల భూములపై పడ్డ ఏ పాలకుడు చరిత్రలో బాగుపడలేదని హెచ్చరించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం 'ధరణి'తో ప్రజలను పీడించి ఏ విధంగా అధికారానికి దూరమైందో... ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే బాటలో పయనిస్తు

మిగతా 2లో




## వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి యూనివర్సిటీల్లో ఫ్యాకల్టీ రిక్రూట్ మెంట్

- యూనివర్సిటీల్లో విద్యాసంస్కరణలపై దృష్టి సారించాం
- ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ లో నెం.1గా నిలపడమే నా ధ్యేయం
- మరో మూడు డిఎస్సీలను కూడా విజయవంతంగా నిర్వహిస్తాం
- ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ను దేశానికే రోల్ మోడల్ చేద్దాం
- విద్యాశాఖ మంత్రి నారా లోకేష్

2లో

# ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానోత్సవం



మీ టీచర్ల గుంపునకు మేస్త్రీ నేనే. మరో రెండేండ్లలో మీ సమస్యలు పరిష్కరిస్త.. రెండేండ్ల దాకా నన్ను పీఆర్సీ, డీఏలు అడుగొద్దు.. నన్ను పాస్ చేస్తరో.. ఫెయిల్ చేస్తరో మీరే తేల్చుకోవాలే.. ఒక్క సంతకంతో కలెక్టర్లు, ఎస్పీలు ట్రాన్స్‌ఫర్ అయిపోతరు. కానీ, టీచర్లు తెలివైనోళ్లు.. వాళ్లను ట్రాన్స్‌ఫర్ చేయలేకపోతున్న..

హైదరాబాద్, సెప్టెంబర్ 5 **అభ్యుదయం**కొడంగల్: రాష్ట్రంలో ఉపాధ్యాయులను మచ్చిక చేసుకునే పనిలో పడ్డారు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. తానే టీచర్ల గుంపునకు మేస్త్రీనంటూ వ్యాఖ్యానించారు. కొడంగల్ పర్యటనలో ఉన్న ఆయన శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానోత్సవంలో పా ల్గొన్నారు. ముందుగా సభలో సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సభలో సీఎం మాట్లాడుతూ తనను పాస్ చేస్తారో.. ఫెయిల్ చేస్తరో టీచర్లే తేల్చుకోవాలని కోరారు. మరో రెండేండ్లలో టీచర్ల సమస్యలు పరిష్కరిస్తానంటూ హామీలు గుప్పించారు. రెండేండ్ల వరకు తనను పీఆర్సీ, డీఏలు అడుగొద్దని విజ్ఞప్తి చేశారు.ప్రపంచ పటాలు పరిశీలించండిరెండేండ్లలో తెలంగాణ విద్యావ్యవస్థను దేశానికే దిక్సూచిగా మార్చాలని కోరారు. ఇప్పటికే అనేక సమస్యలు పరిష్కరించానని, మరో రెండేండ్లలో ఆర్థికంగా వెసులుబాటును బట్టి అన్ని సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పనిలో పనిగా టీచర్లను మెచ్చుకోబోయి సివిల్ సర్వెంట్లను

- మిగతా 2లో పేజిలో

## వైసీపీ నాశనం చేసిన విద్యుత్ వ్యవస్థను గాడిలో పెడుతున్నాం



- రెండేళ్లలో ఒక్క రూపాయి ఛార్జీ పెంచలేదు
- 6 లక్షల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా సోలార్
- కూటమి అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- స్థానిక సంస్థల్లో విజయంతోనే మరింతగా రాష్ట్ర అభివృద్ధి
- ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి

మిగతా 2లో

# ఎస్సీ, ఎస్టీలపై అట్రాసిటీ కేసుల్లో వేగంగా విచారణ

అమరావతి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి విచారణ వేగంగా జరిపి నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా కోర్టుల్లో పరిష్కరించేలా చూడాలని, ప్రత్యేక సెషన్ కోర్టులు, స్పెషల్ కోర్టుల్లో కేసులను రేషనలైజ్ చేసి పరిష్కరించాలని సీఎం సూచించారు. చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా, తప్పు చేసిన వారికి శిక్షపడేలా వ్యవస్థ పనిచేయాలని స్పష్టం చేశారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం అమలు, సంక్షేమంపై రాష్ట్రస్థాయి అత్యున్నత కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీల రక్షణ, సంక్షేమం, విద్య, ఉపాధి, ఆర్థిక సాధికారత, వైద్యారోగ్యం తదితర అంశాలపై సీఎం కీలక సూచనలు చేశారు. గుంటూరు, అనంతపురం, తూర్పుగోదావరి, ప్రకాశం జిల్లాల్లో ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాలకు సంబంధించి ఎక్కువ కేసులు నమోదైన అంశంపై ప్రత్యేకంగా అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. కేసుల సంఖ్యతో పాటు వాటి స్వభావం, కారణాలు, పరిష్కారానికి పడుతున్న సమయం వంటి అంశాలను పరిశీలించాలని స్పష్టం చేశారు. కేసుల పరిష్కారం వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. బాధితులకు అందుతున్న పరిహారం సద్వినియోగం అయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పరిహారంతో పాటు హౌసింగ్ వంటి ఇతర ప్రయోజనాలను కూడా బాధితులకు త్వరితగతిన అందించాలని సూచించారు.

**ఎప్పటికప్పుడు జిల్లా, డివిజన్ స్థాయి సమావేశాలు:**

జిల్లా స్థాయిలో నిర్వహించాల్సిన సమావేశాలు ఇంకా 131 పెండింగ్‌లో ఉండటంపై సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై జిల్లా కలెక్టర్లు తప్పనిసరిగా ఈ సమావేశాలను నిర్వహించాలని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ నివేదిక వెలువడి రెండున్నర దశాబ్దాలు పూర్తయిన నేపథ్యంలో అప్పటి పరిస్థితులు, ప్రస్తుతం వచ్చిన మార్పులను సమగ్రంగా అధ్యయనం చేయాలని ఆదేశించారు. గతంలో ఉన్నట్టుగా రెండు గ్లాసుల విధానం, దేవాలయాల్లోకి ప్రవేశం వంటి వివక్షలు ఇప్పుడు లేవని ఎస్సీ, ఎస్టీల్లో ఆర్థిక సాధికారత కల్పించడంతో పాటు ఆత్మవిశ్వాసం పెంచేలా అన్ని శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సమాజంలోని అన్ని వర్గాల భాగస్వామ్యంతో ఇంక్లూజివ్ గ్రోత్ సాధించేలా కృషి చేయాలని సీఎం సూచించారు.

## వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి యూనివర్సిటీల్లో ఫ్యాకల్టీ రిక్రూట్ మెంట్



అమరావతి, దశాబ్దాలుగా జరగని యూనివర్సిటీ ఫ్యాకల్టీ రిక్రూట్‌మెంట్ కూడా పారదర్శకంగా నిర్వహించి, వచ్చే ఏడాది ఏప్రిల్‌కి ప్రొఫెసర్స్, అసోసియేట్ ప్రొఫెసర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్స్‌ని నియామకాలు పూర్తిచేసి, ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను బలోపేతం చేస్తామని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం విజయవాడ ఎ-1 కన్వెన్షన్ సెంటర్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో కలసి మంత్రి లోకేష్ హాజరైన మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ ప్రజాప్రభుత్వంలో 2029లోగా మొదటి డీఎస్సీ ఏవిధంగా పారదర్శకంగా నిర్వహించామో, రాబోయే మూడు డీఎస్సీలు కూడా అలానే నిర్వహిస్తాం. నాకు క్రమశిక్షణ నేర్పిన తొలి గురువు అమ్మ. సమాజంలో గౌరవంగా నిజాయితీగా ఎలా బతకాలో నేర్పించింది నా తండ్రి చంద్రబాబు నాయుడు.

**డిఎస్సీ అంటే సిబిఎన్... సిబిఎన్ అంటే డిఎస్సీ!**

భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మించిన రోజునే మనందరం టీచర్స్ డేగా జరుపుకుంటున్నాం. బిజీ షెడ్యూలులోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. ఇది విద్య, గురువుల పట్ల ఆయనకున్న గౌరవం. సీబీఎన్ హయాంలో 14 డీఎస్సీలు నిర్వహించగా, సుమారుగా రెండు లక్షల మంది ఉపాధ్యాయులను నియమితులయ్యారు. సీబీఎన్ అంటే డీఎస్సీ... డీఎస్సీ అంటే సీబీఎన్. ముఖ్యమంత్రి గా 4వసారి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలి సంతకం పెట్టింది డీఎస్సీ పైనే. ఆనాడు నేను గౌరవ ముఖ్యమంత్రి కి పారదర్శకంగా డీఎస్సీ నిర్వహిస్తానని హామీ ఇచ్చాను, 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేసే బాధ్యత తీసుకున్నాను. ఈరోజు మా విద్యాశాఖ ఆ హామీని అమలుచేసి చూపించింది. పనిచేసేవాళ్లకే రాళ్ల దెబ్బలు ఉంటాయి. ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని వారు ఈరోజు నాపై అనేక ఆరోపణలు చేస్తున్నారు. ఏమీ పర్వాలేదు. నేను భయపడను.

ఉపాధ్యాయులపై పవిత్రమైన బాధ్యత:

ఇక్కడున్న ఉపాధ్యాయులందరి పైన ఒక పవిత్రమైన బాధ్యత ఉంది. ఈరోజు ఇంట్లో కన్నా ఎక్కువ సమయం పిల్లలు మనతో ఉంటారు. విలువలు, విద్య, క్రమశిక్షణ పిల్లలు మన దగ్గర నేర్చుకుంటారు. ఈరోజు నేను ఈ స్థాయికి రావడానికి తల్లిదండ్రుల తర్వాత ఉపాధ్యాయులే ప్రధాన కారణం. అన్న ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయిన నెలకి నేను పుట్టాను. ముఖ్యమంత్రి మనుమడు అయినంత మాత్రాన స్కూలులో డిసిప్లిన్ తప్పితే టీచర్లు ఒప్పుకునేవారు కాదు. క్రమశిక్షణే ఈరోజు నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చింది. విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పాల్సిన పవిత్రమైన బాధ్యత గురువులపై ఉంది.

# కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకుమళ్లీ పాత రోజులు

(మొదటి పేజి (తరువాయి)

గతంలో విద్యుత్తు సరఫరాపై కాంగ్రెస్ నేతలు సబ్‌స్టేషన్లకు వెళ్లి లాగ్‌బుక్‌లు పరిశీలించి నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారని హరీశ్‌రావు గుర్తుచేశారు. ఇప్పుడు అదే లాగ్‌బుక్‌లను పరిశీలిస్తే కాంగ్రెస్ ప్రభుత్వ విద్యుత్తు సరఫరా పరిస్థితి ఏమిటో తెలుస్తుందని చెప్పారు

శనివారం సిద్దిపేట జిల్లా దుబ్బాకలో రైతు సదస్సుకు హరీశ్‌రావును స్థానిక రైతులు కలిసి తమ కష్టాలు చెప్పుకొన్నారు. పంటలకు అవసరమైన స్థాయిలో విద్యుత్తు సరఫరా కావడం లేదని, పగటి వేళల్లోనే కోతలు ఉండటంతో వరి పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు హరీశ్‌రావు, ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డితో కలిసి గంభీర్‌పూర్ సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి లాగ్‌బుక్‌ను పరిశీలించారు. అనంతరం మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. లాగ్‌బుక్‌లో నమోదైన వివరాల ప్రకారం ఈ నెల 3న ఉదయం 8గంటలకు విద్యుత్తు సరఫరా ప్రారంభమై సాయంత్రం 6గంటలకు నిలిపివేసినట్టు ఉన్నదని చెప్పారు. రైతులకు సుమారు 10గంటలు మాత్రమే సరఫరా జరిగిందని హరీశ్‌రావు వివరించారు. ఈ నెల 4న కూడా ఉదయం 7.45 గంటలకు సరఫరా ప్రారంభమై సాయంత్రం 6 గంటల సమయంలో నిలిపివేసినట్టు నమోదైందని తెలిపారు

మంత్రి కోమటిరెడ్డికి హరీశ్‌రావు సవాల్

విద్యుత్తు సరఫరాపై గతంలో విమర్శలు చేసిన మంత్రి కోమటిరెడ్డికి హరీశ్‌రావు సవాల్ విసిరారు. 'ఆనాడు కేసీఆర్ ప్రభుత్వం 24గంటల కరెంట్ ఇచ్చినా.. 20గంటలే వస్తున్నదని మీరు సబ్‌స్టేషన్లకు వెళ్లి లాగ్‌బుక్‌లు పట్టుకొని మాట్లాడారు. ఇప్పుడు అదే లాగ్‌బుక్‌లో 10గంటల కరెంట్ మాత్రమే నమోదవుతున్నది. మరి ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదు? మీరు చెప్పిన దానికంటే ఒక నిమిషం ఎకువ విద్యుత్తు రైతులకు ఇస్తున్నామని నిరూపించగలరా?' అని ప్రశ్నించారు. 'నల్లగొండకు రమ్మంటారా? ఏ సబ్‌స్టేషన్‌కు పోదాం? కేసీఆర్ ఇచ్చిన కరెంట్ కంటే మీరు ఒక నిమిషమైనా ఎకువ ఇస్తున్నారని లాగ్‌బుక్‌తో నిరూపించగలరా?' అని సవాల్ చేశారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకే ఎదురుదాడి

ప్రభుత్వ వైఫల్యాలపై ప్రతిపక్షం ప్రశ్నిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పకుండా ఎదురుదాడికి దిగుతున్నదని హరీశ్‌రావు మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు, రైతుబీమా, 24గంటల ఉచిత విద్యుత్తు వంటి పథకాలు అమలు చేసి వ్యవసాయరంగానికి అండగా నిలిచిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ, ఎరువుల సరఫరా, పంటల కొనుగోళ్ల విషయంలో రైతులు ఇబ్బందులు ఎదురొంటున్నారని విమర్శించారు. ఇవాళ ఒక కౌలు రైతుకైనా మీరు ఇచ్చిన హామీ ప్రకారం సహాయం అందిందా? రైతుబంధు విషయంలోనూ ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేశారా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

24గంటల కరెంట్ ఇవ్వకపోతే రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు

రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే 24గంటల ఉచిత విద్యుత్తు ఇవ్వాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. పంటలు ఎండిపోకుండా సరఫరాను పునరుద్ధరించాలని లేకపోతే రైతులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, ధర్నాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 'రేవంత్ తాను రైతు బిడ్డను, రైతురాజ్యం తెస్తా అని మాటలు చెప్పడం కాదు.. రైతుకు సమయానికి కరెంట్ ఇవ్వాలి.. రైతుబంధు.. రైతుబీమా.. రుణమాఫీ పూర్తి చేయాలి.. ఎరువులు అందుబాటులో ఉంచాలి..

## వైసీపీ నాశనం చేసిన విద్యుత్ వ్యవస్థను గాడిలో పెడుతున్నాం

రాయచోటి, వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురై నాశనమైన విద్యుత్ వ్యవస్థను కూటమి ప్రభుత్వం గాడిలో పెడుతోందని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యానికి అనుగుణంగా రాష్ట్రంలో నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో శనివారం నాడు ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సహచర మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితో కలిసి పలు అభివృద్ధి, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు అందుకు న్నారు. అనంతరం గ్రీవెన్స్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆ తరువాత కార్యకర్తలతో సమావేశం నిర్వహించి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలని వారికి దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమాలు తరువాత మంత్రి గొట్టిపాటి మీడియాతో మాట్లాడుతూ గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలపై

తొమ్మిదిసార్లు విద్యుత్ ఛార్జీల భారం మోపారని మంత్రి విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లకు పైగా పూర్తయినా ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా విద్యుత్ ఛార్జీలు పెంచలేద న్నారు. ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడటమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని చెప్పారు.

# 264 ఎకరాల్లో భారీ ప్రాజెక్ట్...

ఈ డేటా సెంటర్ సామర్థ్యం గరిష్ఠంగా 1 గిగావాట్ (జీడబ్ల్యూ) వరకు ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ కంపెనీలు, హైపర్‌స్కేలర్లు ఉపయోగించుకునేలా దీన్ని ప్రత్యేకంగా రూపొందించనున్నారు. అధిక సామర్థ్యం ఉన్న కంప్యూటింగ్ సిస్టమ్స్‌ను నిర్వహించేందుకు లిక్విడ్-కూల్డ్ టెక్నాలజీతో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ఈ ప్రాజెక్ట్ వల్ల హైదరాబాద్ ప్రాంతంలో నేరుగా, పరోక్షంగా వేలాది ఉద్యోగాలు వస్తాయని హైపర్‌వాల్ట్ తెలిపింది. ఈ మౌలిక సదుపాయాలను నిర్మించి నిర్వహించేందుకు హైపర్‌వాల్ట్, దాని భాగస్వాములు కలిసి రూ.70,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నారు. కస్టమర్ల అవసరాలు, టెక్నాలజీలో వచ్చే మార్పులను బట్టి ఈ ప్రాజెక్ట్‌ను దశలవారీగా చేపట్టనున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్ట్‌ను రాష్ట్రానికి, దేశానికి "చారిత్రాత్మకమైనది"గా అభివర్ణించారు. ఏఐ విప్లవంలో హైదరాబాద్ ఇప్పుడు ప్రపంచ స్థాయిలో ముందంజలో ఉందని ఆయన అన్నారు. ముఖ్యంగా ఏఐకి అవసరమైన మౌలిక సదుపాయాలపై హైదరాబాద్ దృష్టి పెడుతోందని చెప్పారు. "ఈ దశాబ్దం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ది. ఏఐ మోడల్స్, వాటిని నడిపించే కంప్యూటింగ్ సామర్థ్యం వేగంగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలుగా మారుతున్నాయి. ఈ కంప్యూటింగ్ సదుపాయం తెలంగాణలో ఉండటం మనకు ఒక అదనపు ప్రయోజనం" అని రేవంత్ రెడ్డి అన్నారు. డేటా సెంటర్ క్యాంపస్ నిర్మాణంలో గ్రీన్ ఎనర్జీని ఉపయోగించడంతో పాటు, నీటి వినియోగాన్ని సమతుల్యం చేసే డిజైన్ విధానాలను పాటించనున్నట్లు కంపెనీ తెలిపింది. టీసీఎస్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ కె. కృతివాసన్ మాట్లాడుతూ, ఈ ప్రాజెక్ట్ తమ "ఇన్‌ఫ్రాస్ట్రక్చర్-టు-ఇంటెలిజెన్స్" వ్యూహాన్ని మరింత ముందుకు తీసుకెళ్తుందని చెప్పారు. ఏఐకి సిద్ధంగా ఉండే మౌలిక సదుపాయాలను టీసీఎస్ క్లౌడ్, ఏఐ, ఎంటర్‌ప్రైజ్ సామర్థ్యాలతో కలిపి ఈ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. "ప్రపంచవ్యాప్తంగా ఉన్న కస్టమర్ల అవసరాలను తీర్చేందుకు హైదరాబాద్‌కు అవసరమైన స్థాయి, ప్రతిభ, టెక్నాలజీ ఎకోసిస్టమ్ ఉన్నాయి" అని కృతివాసన్ అన్నారు. ఈ భారీ పెట్టుబడి ద్వారా ఏఐ, డేటా సెంటర్ల రంగంతోపాటు విద్యుత్, కూలింగ్, నెట్‌వర్కింగ్, నిర్మాణం, ఇంజినీరింగ్, ఆపరేషన్స్ వంటి అనుబంధ రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. పర్యావరణానికి అనుకూలంగా గ్రీన్ ఎనర్జీ, వాటర్-న్యూట్రల్ డిజైన్‌తో ఈ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు.




ఈ ప్రాజెక్టుకు సంబంధించిన చర్చలకు 2026 జనవరిలో దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టాటా సన్స్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ మధ్య జరిగిన సమావేశం నాంది పలికింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం, టీసీఎస్ ప్రతినిధులతో పలుమార్లు చర్చలు జరిపి కొద్ది నెలల్లోనే ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకొచ్చాయి. దేశంలోని మరో ఐదు రాష్ట్రాల నుంచి పోటీ ఉన్నప్పటికీ తెలంగాణ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును సాధించింది. ఈ ప్రాజెక్టుతో హైదరాబాద్‌ను గ్లోబల్ ఏఐ, డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం మరింత చేరువైంది. ఈ కీలక సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ బి.అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎండీ కె. శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణాదిత్య, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ నిఖిల్ చక్రవర్తి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానోత్సవం

అవమానించారు. ఒక్క సంతకంతో కలెక్టర్లు, ఎస్పీలు ట్రాన్స్‌ఫర్ అయిపోతారని, టీచర్లు తెలివైన వాళ్లు.. వాళ్లను ట్రాన్స్‌ఫర్ చేయలేకపోతున్నానంటూ వ్యాఖ్యానించారు. ప్రభుత్వం ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. అనంతరం ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్, క్రిటికల్ కేర్ యూనిట్‌లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, తాండూర్, పరిగి ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, అరబిందో ఫార్మా ఫౌండేషన్ సీఎస్ఆర్ హెడ్ సదానంద్‌రెడ్డి, అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**123మందిలో 11 మందికే అవార్డులు**

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఈసారి గురుపూజోత్సవ కార్యక్రమాన్ని కొడంగల్‌లో నిర్వహించారు. రాష్ట్ర విద్యాశాఖ 123 మంది ఉత్తమ ఉపాధ్యాయులను అవార్డులకు ఎంపిక చేసింది. మరో ముగ్గురు అధికారులకు విశిష్ట సేవా పురస్కారాలను ప్రకటించింది. దీంతో అవార్డు గ్రహీతలంతా ఎంతో ఆశతో కొడంగల్ చేరుకున్నారు.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు వస్తుందని భావించారు. కానీ 123 మంది అవార్డు గ్రహీతల్లో కేవలం 11 మందికి మాత్రమే సీఎం చేతుల మీదుగా పురస్కారాలు అందాయి. మరో ముగ్గురు అధికారులకు కూడా సీఎం అవార్డులు అందజేశారు. అనంతరం సీఎం వేదిక దిగడంతో ప్రజాప్రతినిధులు కూడా వెళ్లిపోయారు. మిగిలిన అవార్డు గ్రహీతలకు అధికారుల చేతుల మీదుగానే అవార్డులు అందించాల్సి వచ్చింది. కొడంగల్ దాకా పిలిచి కొందరికే అవార్డులివ్వడంపై కొందరు నొచ్చుకున్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం భూదందా సాగిస్తోంది



తన గోతిని తానే తవ్వుకుంటున్నారని మండిపడ్డారు. హైడ్రా, క్యూర్, 22ఏ వంటి నిర్ణయాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, 30 శాతం కమీషన్ల కోసం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తులో బీఆర్ఎస్ కంటే దారుణమైన పరాభవం తప్పదని స్పష్టం చేశారు. వెంటనే 22ఏ కింద చేర్చిన బాధితుల భూములపై రివ్యూ జరిపి, ఆ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ రాజీలేని పోరాటం చేస్తుందని తేల్చిచెప్పారు.

# టీచర్‌కు ప్రత్యామ్నాయం లేదు

**విలువలు, మానవీయత, బాధ్యతను పెంపొందించడంలో ఉపాధ్యాయుడి పాత్ర కీలకం: కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం**




వరంగల్, 5 సెప్టెంబర్
వ్యక్తి, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, విద్యార్థులను విలువలతో కూడిన పరిపూర్ణ వ్యక్తులుగా తీర్చిదిద్దడంలో టీచర్‌కు ప్రత్యామ్నాయం లేదని కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 138వ జయంతిని పురస్కరించుకుని కాకతీయ విశ్వవిద్యాలయ విద్యా కళాశాలలో శుక్రవారం నిర్వహించిన టీచర్స్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నల్లాని శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య రామచంద్రం మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థుల ఆలోచనా విధానం, మనస్తత్వం, వైఖరిలో గణనీయమైన మార్పులు వస్తున్నాయని, వాటిని అర్థం చేసుకుని ఉపాధ్యాయులు కూడా నిరంతరం తమను తాము అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం కృత్రిమ మేధ (ఏఐ) విస్తరిస్తున్న నేపథ్యంలో సాంకేతికత ఉపాధ్యాయులకు సహాయకారిగా ఉపయోగపడుతుందని, అయితే విద్యార్థుల్లో మానవీయత, నైతిక విలువలు, బాధ్యత, మంచి పౌరసత్వం వంటి లక్షణాలను పెంపొందించడంలో ఉపాధ్యాయుడి పాత్రను ఏ సాంకేతికతా భర్తీ చేయలేదని స్పష్టం చేశారు. ఓఎస్డీ, ఎడ్‌సెట్ కన్వీనర్ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి మాట్లాడుతూ.. దేశ జనాభాలో సుమారు 33 శాతం యువత ఉన్నారని, వారిని సమర్థవంతమైన మానవ వనరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైనదని, ఒక ఉపాధ్యాయుడు అనేక రంగాలకు చెందిన నిపుణులను తీర్చిదిద్దగలరని పేర్కొన్నారు. విద్యా కళాశాల పూర్వపు ఆచార్యులు అందించిన సేవలను ఆయన ఈ సందర్భంగా స్మరించుకున్నారు. డీన్ ఆచార్య ఎన్. రామనాథ్ కిషన్ మాట్లాడుతూ.. కృత్రిమ మేధను బాధ్యతాయుతంగా, జాగ్రత్తగా వినియోగిస్తూ జాతి నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. పాలకమండలి సభ్యులు డాక్టర్ చిర్రా రాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజానికి దిశానిర్దేశకులని, మానవ విలువలను పెంపొందించడంలో వారికి గురుతర బాధ్యత ఉందన్నారు. సహాయ రిజిస్ట్రార్ డాక్టర్ కోలా శంకర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని, వాటిని కొనలేమని పేర్కొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ నల్లాని శ్రీనివాస్ కళాశాల ప్రగతిని వివరించారు. జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువా, జ్ఞాపిక, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ సంగాని మల్లేశ్వర్, కళాశాల బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఫిర్యాదులపై తక్షణ స్పందన

ఎస్సీ,ఎస్టీ హాస్టళ్లలో టీచర్లు నివాసం ఉండేలా చూడాలని ఎమ్మెల్యే కొండ్రు మురళి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన సీఎం తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వివిధ గ్రామాలు, రహదారులపై హరిజన వాడ అనే పేర్లను మార్చాలంటూ పూతలపట్టు శాసనసభ్యుడు మురళీమోహన్ ముఖ్యమంత్రికి తెలిపారు. దీనిపై తక్షణమే చర్యలు చేపడతామని సీఎం స్పష్టం చేశారు. గిరిజనులు ట్రైకార్ రుణాలను పెంచాలని వచ్చిన అభ్యర్థనపైనా సీఎం సానుకూలంగా స్పందించారు.

ఈ సమావేశానికి మంత్రులు డీబీవీ స్వామి, వి.అనిత, జి. సంధ్యారాణి, ఎంపీలు కృష్ణప్రసాద్, దగ్గుమళ్ల ప్రసాద్ సహా రాష్ట్ర వ్యాప్త ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల శాసనసభ్యులు, సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## మెగా డిఎస్సీ-2025 నియామక ప్రక్రియలో సంపూర్ణ పారదర్శకతక్రీడా కోటా కింద ఈడిగ ప్రభాకర్ ఎస్‌జీటీ (తెలుగు) ఎంపికపై విచారణ

**నివేదిక అందగానే నిబంధనలకు అనుగుణంగా చర్యలు**

అమరావతి, సెప్టెంబర్ 5కర్నూలు జిల్లా, కౌతాళం మండలం, వల్లూరు ఎంపీపీఎస్ (న్యూ) పాఠశాలలో క్రీడా కోటా కింద ఈడిగ ప్రభాకర్, ఎస్‌జీటీ (తెలుగు)గా ఎంపిక, పోస్టింగ్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ గత కొద్ది రోజులుగా వస్తున్న మీడియా కథనాలపై పాఠశాల విద్యాశాఖ ప్రకటన విడుదల చేసింది. ఘటన గురించి తెలిసిన వెంటనే శాఖాపరమైన దర్యాప్తును విద్యా శాఖ ప్రారంభించింది. ఉన్నతాధికారులు విచారణ ప్రక్రియను పరిశీలిస్తున్నారు. కర్నూలు డీఈఓ విచారణను ప్రారంభించి, సమగ్ర పరిశీలన కోసం సంబంధిత రికార్డులను, వెరిఫికేషన్ ఫైళ్లను తెప్పించారు. విచారణ నివేదిక అందగానే, రిక్రూట్మెంట్, సర్వీస్ నిబంధనలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. మెగా డిఎస్సీ-2025 నియామక ప్రక్రియలో సంపూర్ణ పారదర్శకత, ప్రతిభ ఆధారిత ఎంపిక, విధానాన్నిఅవలంభించామని పాఠశాల విద్యాశాఖ పునరుద్ఘాటిస్తోంది. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ ప్రకటన విడుదల చేశారు.

## గిరిజనుల జన్యు రక్త వ్యాధుల ముందస్తుగానే గుర్తింపు

**రాష్ట్రంలోనే ఉన్న ఏకైక ప్రత్యేక ల్యాబ్‌లో 3 నెలల్లో 121 పరీక్షలు**
**94 మందిలో సమస్యల గుర్తింపు**
**వైజాగ్ లోని కెజీహెచ్ కేంద్రంగా పరీక్షలు, చికిత్స ఉచితం**

అమరావతి, సెప్టెంబర్ 5
గిరిజనుల ఆరోగ్యానికి మరింత భరోసా పెరిగింది. గిరిజన ప్రాంతాల్లో తలసేమియా, సికిల్‌సెల్ వంటి జన్యుపరమైన రక్త రుగ్మతలను ముందస్తుగా గుర్తించి, సకాలంలో వైద్య సేవలు అందించేందుకు రాష్ట్రంలో తొలిసారిగా విశాఖలోని కేజీహెచ్‌లో ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ కంపిటెన్స్ (సీఓసీ) ల్యాబ్ ద్వారా మంచి ఫలితాలు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది మేలో ప్రారంభమైన ఈ కేంద్రం ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు ప్రాంతీయ నిర్ధారణ కేంద్రంగా సేవలందిస్తోంది. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక దృష్టితో గిరిజన ప్రాంతాల ప్రజలకు అధునాతన వైద్య సేవలను చేరువ చేస్తున్నారు. ఈ క్రమంలో కేజీహెచ్ లో ఉన్న కేంద్రంలో ఇటీవల వరకు 121 రక్త నమూనాలను పరీక్షించగా, 94 నమూనాల్లో జన్యుపరమైన హీమోగ్లోబిన్ వైవిధ్యాలు లేదా క్యారియర్ స్థితులు గుర్తించారు. పరీక్షలు, జన్యు సలహాలు, క్లినికల్ మేనేజ్‌మెంట్ సేవలను ఉచితంగా అందిస్తున్నారు.

94 మందిలో జన్యు వైవిధ్యాలు
పరీక్షల్లో 33 మందిలో సికిల్‌సెల్ ట్రైట్ (హెచ్‌బీఏఎస్) క్యారియర్ స్థితి, 23 మందిలో హోమోజైగస్ సికిల్‌సెల్ వ్యాధి (హెచ్‌బీఎస్‌ఎస్) గుర్తించారు. మరో 10 మందిలో తలసేమియా ట్రైట్, ఆరుగురిలో తలసేమియా మేజర్, మరో ఆరుగురిలో సికిల్‌సెల్?తలసేమియా కలయిక ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఇద్దరిలో హెచ్‌బీడీ, హెచ్‌బీసీ, హెచ్‌బీఈ వంటి అరుదైన హీమోగ్లోబిన్ వైవిధ్యాలు బయటపడ్డాయి. మొత్తంగా పరీక్షించిన 121 నమూనాల్లో 94 అంటే 77.7 శాతం నమూనాల్లో జన్యుపరమైన హీమోగ్లోబిన్ వైవిధ్యాలు లేదా క్యారియర్ స్థితులు ఉన్నట్లు నివేదిక వెల్లడించింది.

రూ.2.85 కోట్లతో మౌలిక వసతులు

కేంద్రం ఏర్పాటుకు రూ.2.85 కోట్ల విలువైన పరికరాల మౌలిక వసతులు సమకూరాయి. పరికరాల నిర్వహణ కోసం రూ.16.93 లక్షలు వార్షిక నిర్వహణ ఒప్పందాల (ఏఎంసీ) కింద కేటాయించారు. రియాజెంట్లు, పరీక్షా కిట్ల కోసం రూ.45.54 లక్షలు కేజీహెచ్ సీఎఫ్‌ఎంఎస్ ఖాతాకు జమ చేసి వినియోగానికి కేటాయించారు.
ఈ సహకారంతో కేంద్రంలో నిర్వహించే నిర్ధారణ పరీక్షలు, జన్యు సలహాలు, క్లినికల్ మేనేజ్‌మెంట్ సేవలను
రోగులకు 100 శాతం ఉచితంగా అందిస్తున్నామని కెజీహెచ్ సూపరింటెండెంట్ ఇ. వాణి తెలిపారు.

## విపత్తు సమయంలో సిబ్బంది సేవలు ఎనలేనివి

**వాటర్ బ్రౌజర్ అగ్నిమాపక వాహనాన్ని ప్రారంభించిన ఏలూరు ఎమ్మెల్యే**




ఏలూరు, సెప్టెంబర్, 5 విపత్తు సమయంలో రాష్ట్ర విపత్తు నివారణ మరియు అగ్నిమాపక దళం సిబ్బంది అందించే సేవలు ఎనలేనివని ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) చెప్పారు. స్థానిక అగ్నిమాపక కేంద్రంలో 80 లక్షల రూపాయల 15వ ప్రణాళిక సంఘం నిధులతో ప్రభుత్వం అందించిన అధిక నీటి సామర్థ్యం కలిగిన వాటర్ బ్రౌజర్ అగ్నిమాపక వాహనాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ తుఫానులు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో రాష్ట్ర విపత్తు నివారణ, అగ్నిమాపక దళం సిబ్బంది అందించే సేవలతో ఎటువంటి ప్రాణ, ఆస్థి నష్టాలు కలగకుండా రక్షించుకోగలుతున్నామన్నారు. నూతన వాహనం ద్వారా మరింత మెరుగైన సేవలందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో 7 అగ్నిమాపక కేంద్రాలు ఉన్నామని, 2026 ఏప్రిల్ నుండి ఇప్పటివరకు 135 అగ్ని ప్రమాదాలను నివారించి 2.39 కోట్ల రూపాయల ఆస్తిని అగ్నిప్రమాదాల బారి నుండి రక్షించామన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది రాఘవులు, ప్రభృతులు పాల్గొన్నారు.

## ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలి

- **12 ఏళ్ల కిందటి కాలనీని 22ఏలో చేర్చారు**
- **మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఫైర్**

హైదరాబాద్,సెప్టెంబర్5 రూపాయి రూపాయి కూడబెట్టుకుని నిర్మించుకున్న ఇళ్లను రాత్రికి రాత్రి 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ దారుణ నిర్ణయమని మెదక్ ఎంపీ రఘునందన్ రావు మండిపడ్డారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని సింఫనీ పార్క్ హోమ్స్ కాలనీలో 22ఏ భూముల సమస్యపై ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. అన్ని ప్రభుత్వ శాఖల అనుమతులతో 55 ఎకరాల్లో 1,500 ఇళ్ల నిర్మాణం జరిగి 12 ఏళ్లు గడుస్తోందని... ఇప్పుడు ఉన్నట్టుండి ఆ ఇళ్లను నిషేధిత జాబితాలో పెట్టడంపై కాలనీవాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని చెప్పారు. బాధితుల పక్షాన పోరాడతానని హామీ ఇచ్చారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నివాసాన్ని ఏ దరఖాస్తు ఆధారంగా 22ఏ జాబితా నుంచి తొలగించారో, అదే నిబంధనలను సామాన్య ప్రజల ఆస్తులకు కూడా వర్తింపజేసి వెంటనే తొలగించాలని ఎంపీ రఘునందన్ రావు సూటిగా నిలదీశారు. కేవలం సాంకేతిక తప్పు జరిగిందని రెవెన్యూ మంత్రి క్షమాపణలు చెబితే సరిపోదని, తక్షణమే ఆ తప్పును సరిదిద్ది ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.
నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ 22ఏ జాబితా పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## భద్రతా చర్యలు పాటించని యజమానులపై క్రిమినల్ కేసులు

**-ఏలూరు జిల్లా డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ అఫ్ ఫ్యాక్టరీస్ కృష్ణమూర్తి**

ఏలూరు, సెప్టెంబర్, 5 కర్మాగారాలలో పటిష్టమైన భద్రతా చర్యలు పాటించని యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఏలూరు జిల్లా డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ అఫ్ ఫ్యాక్టరీస్ కృష్ణమూర్తి హెచ్చరించారు. ఏలూరు, తూర్పు గోదావరి జిల్లాలో ప్రమాదకరమైన రసాయనాలు కర్మాగారాలలో ఉత్తమ భద్రత విధానాలపై ఆయా సంస్థలలో పనిచేసే భద్రతా అధికారులతో శనివారం రాజమండ్రిలోని ఆంధ్రపేపెర్ కర్మాగారంలో కృష్ణమూర్తి సమీక్షించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ఏలూరు, తూర్పు గోదావరి జిల్లాలలోని కర్మాగారాలలో ముఖ్యంగా ప్రమాదకరమైన రసాయనాలు తయారుచేసే కర్మాగారాలలో కార్మికుల భద్రతకు పూర్తిస్థాయిలో భద్రత చర్యలు చేయవలసిందే బాధ్యత ఆయా కర్మాగార యజమానులదేనన్నారు. ఆయా కర్మాగారాలలో భద్రతా చర్యలను భద్రతా అధికారులు ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలన్నారు. తమ శాఖ సిబ్బంది తనిఖీకి వచ్చినప్పుడు భద్రతా లోపాలను గుర్తించినట్లయితే కర్మాగారాలను మూసివేసేందుకు చర్యలు తీసుకుంటామని, అంతేకాక సంబంధిత కర్మాగార యజమానులు, భద్రతా అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ అఫ్ ఫ్యాక్టరీస్ శ్రీనివాస , ఏలూరు మరియు తూర్పు గోదావరి జిల్లాల నుండి వివిధ కర్మాగారాముల నుండి మొత్తం 50 మంది భద్రతా అధికారులు హాజరయ్యారు.

## జీవో నెంబర్ 21, 31 లను రద్దు చేయాలి

**ఆంధ్రప్రదేశ్ ఆటో అండ్ మోటార్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ యూనియన్ డిమాండ్**

ఏలూరు, సెప్టెంబర్ 5 (ఆర్ఎన్ఏ): ఆటో డ్రైవర్లకు ఈఎస్ఐ , పెన్షన్ తో కూడిన సమగ్ర సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ఆటోలపై భారీ జరిమానాలు విధించే జీవో నెంబర్ 21, 31 లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ఆటో అండ్ మోటార్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ యూనియన్ ( ఏఐటియుసి ) ఏలూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో ఈనెల ఏడవ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ఆటో డ్రైవర్స్ అంతా పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస డాంగే, ఏపీ ఆటో అండ్ మోటార్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాశీ కృష్ణ నేడు ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చినటువంటి హామీలన్నింటినీ అమలు చేయాలని , భారీగా పెంచిన థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, రోడ్డు టాక్స్, గ్రీన్ టాక్స్ లను 30% తగ్గించాలని , ట్రాఫిక్ నిఘా, ఈ చలానాలను రద్దు చేయాలని, కొత్త వాహనాలు కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం హామీతో రాయితీతో కూడిన రుణాలను మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కోసం సోమవారం నాడు కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ఆందోళనలో ఆటో డ్రైవర్లు పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు కోరారు.

## కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి

హైదరాబాద్,సెప్టెంబర్5 బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి తక్షణమే రాజీనామా చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధిగా తన బాధ్యతలు నిర్వర్తించని వ్యక్తి ఆ పదవిలో కొనసాగడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయమై ఈ నెల 6న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద 'మహా ధర్నా' నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ధర్నాకు సంబంధించిన సన్నాహక సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రానికి వందేళ్ల నష్టం వాటిల్లిందని విమర్శించారు. "వెయ్యి రోజులుగా ఎమ్మెల్యేగా వేతనం తీసుకుంటున్న కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని, కనీసం తన నియోజకవర్గ ప్రజలకు కూడా అందుబాటులో ఉండటం లేదు. ప్రతిపక్ష నేతగా ఆయన పూర్తిగా విఫలమయ్యారు" అని ఆరోపించారు. కేసీఆర్ వైఖరిని ప్రజల దృష్టికి తీసుకెళ్లడానికే ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నామని మంత్రి స్పష్టం చేశారు.

# గడ్డం లక్ష్మీదేవమ్మకు మడే బిక్షపతి ఘన నివాళి

**పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దిన ఆదర్శమూర్తి**

**ఎస్సీ, ఎస్టీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడే బిక్షపతి**




హనుమకొండ, సెప్టెంబర్ 5 : హనుమకొండ పట్టణంలోని ఎక్సైజ్ కాలనీకి చెందిన ఉపాధ్యాయుడు గడ్డం సురేష్ మాతృమూర్తి గడ్డం లక్ష్మీదేవమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, శనివారం వారి నివాసంలో దశది నకర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్సీ, ఎస్టీ టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడే బిక్షపతి హాజరై లక్ష్మీదేవమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మడే బిక్షపతి మాట్లాడుతూ, పేద కుటుంబంలో జన్మించి తాను విద్యావంతురాలు కాకపోయినప్పటికీ తన ఆరుగురు పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్ది, సమాజంలో ఉన్నత స్థానాల్లో నిలిచేలా చేసిన లక్ష్మీదేవమ్మ జీవితం ఆదర్శప్రాయమని కొనియాడారు. ఆమె కుమారుడు గడ్డం సురేష్ భూపాలపల్లి జిల్లాలోని కమలాపూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ, తల్లి ఆశయాలకు అనుగుణంగా పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు విద్యాబోధనతో పాటు సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతూ, యువతకు వివిధ ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పిస్తూ మార్గనిర్దేశం చేస్తున్నారని తెలిపారు. లక్ష్మీదేవమ్మ ఇతర కుమారులు కూడా తమ వృత్తులతో పాటు సామాజిక సేవలో ముందుండటం అభినందనీయమన్నారు. ఇలాంటి సంతానాన్ని సమాజానికి అందించిన లక్ష్మీదేవమ్మ నిజంగా ఆదర్శ మాతృమూర్తి అని మడే బిక్షపతి పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన ఉపాధ్యాయులు, భూపాలపల్లి జిల్లాలో పనిచేస్తున్న పలువురు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని లక్ష్మీదేవమ్మకు నివాళులర్పించారు.

# మదర్ తెరిసా సేవలు చిరస్మరణీయం

**ఫాతిమా నగర్‌లో మదర్ థెరిసా విగ్రహం వద్ద ప్రత్యేక ప్రార్థనలు**



హనుమకొండ సెప్టెంబర్ 05
మదర్ తెరిసా వర్ధంతి సందర్భంగా ఫాతిమా నగర్‌లోని మదర్ తెరిసా విగ్రహం వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనస భ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొని మదర్ తెరిసాకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమాజంలోని పేదలు, నిరుపేదలు, అనాథలు, నిరాశ్రయులు, అభాగ్యుల కోసం మదర్ తెరిసా చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఎలాంటి స్వార్థం లేకుండా మానవ సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన ఆమె సేవా స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. మదర్ తెరిసా చూపిన మానవతా మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని, సమాజంలో ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఆమె ఆశయాలను కొనసాగిస్తూ సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం మదర్ తెరిసా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొని మదర్ తెరిసా సేవలను స్మరించుకున్నారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

**అనుమానాస్పద లింకులను క్లిక్ చేయొద్దు**

**ఓటీపీ, పిన్, పాస్‌వర్డ్‌లను ఎవరితోనూ పంచుకోవద్దు: ఎస్సై త్రిలోక్‌నాథ్‌రెడ్డి**




గోరికొత్తపల్లి, సెప్టెంబర్ 5 :రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గోరికొత్తపల్లి ఎస్సై త్రి లో క్ నా థ్ రెం డ్డి సూచించారు. సోషల్ మీడియా, వాట్సాప్ తది తర మాధ్యమాల ద్వారా వచ్చే అనుమానాస్పద యాప్‌లు, లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయడం లేదా డౌన్‌లోడ్ చేయడం చేయవద్దని హెచ్చరించారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపించే సందేశాలు, లింకుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. బ్యాంకు ఖాతాలకు సంబంధించిన ఓటీపీ, యూపీఐ పిన్, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు ఖాతా వివరాలు వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకో వద్దన్నారు. బ్యాంకు లేదా ఇతర సంస్థల పేరుతో వచ్చే అనుమానాస్పద ఫోన్‌కాల్స్, మెసేజ్‌లకు స్పందించే ముందు వాటి నిజానిజాలను నిర్ధారిం చుకోవాలని తెలిపారు.

# తెలంగాణ పర్యాటక అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

**సెప్టెంబర్ 7 వరకు దరఖాస్తులకు అవకాశం**

**వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వ్యక్తులు, సంస్థలకు పురస్కారాలు**

**సెప్టెంబర్ 27 ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా అవార్డుల ప్రదానం**

హనుమకొండ, సెప్టెంబర్ 5
ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అవార్డులు--2026 కోసం రాష్ట్ర పర్యాటక శాఖ అర్హులైన వ్యక్తులు, సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా వివిధ విభాగాల్లో అవార్డులు అందించను న్నారు. రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న వ్యక్తులు, సంస్థలు, ట్రావెల్ ఏజెంట్లు, టూర్ ఆపరేటర్లు, హోటళ్లు, రెస్టారెంట్లు, రిసార్టులు తదితర విభాగాలకు పురస్కారాలు అందించనున్నట్లు పర్యాటక శాఖ తెలిపింది. పర్యాటక రచనలు, ప్రచురణలు, తెలంగాణ పర్యాటకంపై ఉత్తమ చిత్రం, ట్రావెల్ ఏజెంట్లు, టూర్ ఆపరేటర్లు, హోటళ్లు, రిసార్టులు, రెస్టారెంట్లు, పర్యాటక గైడ్లు, గ్రామీణ పర్యాటక ప్రాజెక్టులు, పర్యాటక విద్యాసంస్థలు, వైద్య పర్యాటకం, వినోద పార్కులు, వినూత్న పర్యాటక ప్రాజెక్టులు, సామాజిక మాధ్యమాలు, యువ పర్యాటక క్లబ్ తదితర విభాగాల్లో అవార్డులకు ఎంపిక చేయనున్నారు.

హోటళ్లు, రెస్టారెంట్లు, రిసార్టుల ఎంపికలో పనితీరు, పరిశుభ్రత, సేవలు, సౌకర్యాలు, పర్యాటకుల సంఖ్య, టర్నోవర్‌తో పాటు పర్యావరణహిత విధానాలు, దివ్యాంగులకు సౌకర్యా లు, పునరుత్పాదక ఇంధన వినియోగం, వ్యర్థాల నిర్వహణ, భద్రతా ప్రమాణాలు, వినూత్న కార్యక్ర మాలను పరిగణనలోకి తీసుకోనున్నారు. పర్యాటక రచనల విభాగంలో తెలుగు, ఆంగ్ల భాషల్లో ప్రచురి తమైన వ్యాసాలు అర్హత పొందుతాయి.
అవసరమైన విభాగాల్లో చార్టర్డ్ అకౌంటెంట్ లేదా చట్టబద్ధ ఆడిటర్ ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. ప్రత్యేక కమిటీలు దరఖాస్తులను పరిశీలించి అవార్డులకు అర్హులను ఎంపిక చేస్తాయి. అవసరమైతే సంబంధిత పర్యాటక ప్రాంతాలు, సంస్థలు, హోటళ్లు, రిసార్టులను కమిటీ సభ్యులు స్వయంగా పరిశీలిం చనున్నారు.

7వ తేదీతో గడువు అర్హత కలిగిన వారు పూర్తి చేసిన దరఖాస్తుతో పాటు అవసరమైన ధ్రువపత్రాలు, ఫొటోలు, ఇతర ఆధారాలను జతచేసి సెప్టెంబర్ 7, 2026లోగా డైరెక్టర్, పర్యాటక శాఖ, తెలంగాణ ప్రభుత్వం, కళా భవన్, రవీంద్ర భారతి, సైఫాబాద్, హైదరాబాద్--500004 చిరునామాకు సమర్పించాలి.
మరిన్ని వివరాలకు 9440816065, 9440816068 నంబర్లలో సంప్రదించవచ్చని పర్యాటక శాఖ తెలిపింది.

# పదేళ్లు అధికారంలో ఉండి రైతులకు ఏం చేశారు.

**రైతుల కోసం అంటూ హడావుడి ఎందుకు.**

**బీఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్ మండల అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ సూటి ప్రశ్న,**



గోవిందరావుపేట, సెప్టెంబర్5 బిఆర్ఎస్ నాయకులు 10 సంవత్సరాలు అధికారంలోఉండి రైతులకు ఏం చేశారో తెలియజేయాలని మండల కాం గ్రెస్ పార్టీ అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ సవాలు విసిరారు, అధికారం కోల్పోయిన బిఆర్ఎస్ నాయ కులు మండలంలో రైతులకు సాగునీటి సమస్యపై బీఆర్ఎస్ నాయకులు రైతుల సాగునీటి కోసం హాయ్ రా నా పడడంలో అంతర్యమేమిటని బిఆర్ఎస్ నేతలను పాలడుగు వెంకట కృష్ణ ప్రశ్నించారు, కాకులమర్రి లక్ష్మణ్ బాబు, బడే నాగజ్యోతి చేస్తున్న రాజకీయ విమర్శలపై స్పందిస్తూ శనివారం గోవిందరావుపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ మాట్లాడుతూ"రైతులపై మీకు నిజంగా ప్రేమ ఉన్నట్లయితే10దేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు గుర్తు రాలేదని అన్నారు, అంతేకాకుండాగోవిందరావుపేట మండల రైతుల సాగునీటి సమస్య మీ పాలనలో ఎందుకు పరిష్కా రించలేకపోయారో సమాధానం చెప్పాలని తెలియజేశారు, లక్నవరం జలాశయానికి దేవాదుల ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను ఎందుకు పైపులైన్ పనులు చేపట్టలేదని అని ఆయన సూటిగా ప్రశ్నించారు. సాగునీటి సమస్యను పరిష్కరించే అవకాశం ఉన్నప్పటికీ అధికార యంత్రాంగంవనరులు వారి చేతుల్లోనే ఉన్నాయని గుర్తు చేశారు. అయినప్పటికీ రైతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకుండా ఇప్పుడు ప్రతిపక్షం లో ఉండి రైతుల పట్ల మొసలి కన్నీరు కార్చడం విడ్డూరంగా ఉంద న్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు సాగునీటి సమస్య పట్టించుకోలేదు ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు, రాజకీయ హడావుడితో సాధిస్తా మని ప్రజలను మభ్యపెట్టడం సరికాదని వెంకటకృష్ణ బి ఆర్ ఎస్ నాయకులకు గుర్తు చేశారు,రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న సమయంలో వారి సమస్యను పరిష్కరిం చేందుకు ప్రభుత్వంతో కలిసి పనిచేయాల్సింది పోయి, గోవిందరావుపేట మండల కేంద్రానికి వచ్చి డీజేలు పెట్టుకుని నృత్యాలు చేస్తూ రాజకీయ హడావుడి చేయడం అంతర్యమేమిటో అని అన్నారు, ర్యాలీ రైతుల కోసం చేశారా రాజకీయ ఉనికి కాపాడుకోవడానికి చేశారని ప్రజలకు గమనిస్తున్నారని తెలిపారు,మరోవైపు రైతుల సాగునీటి సమస్యపై మంత్రి సీతక్క ఇప్పటికే స్పందించి లక్నవరం జలాశయం నుంచి సాగునీటిని విడుదల చేయడానికి చర్యలు తీసుకుంటున్నారని హ మి ఇవ్వడం జరిగిందని అన్నారునీటి పారుదల శాఖ నీరు విడుదలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారని తెలియజేశారు,"రైతులకు నీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అధికారులు నీటి విడుదలకు సిద్ధమవుతున్న సమయంలో కూడా కావాలనే గోవిందరావుపేటకు వచ్చి రాజకీయ రాద్ధాంతం చేయడం ఎందుకు? రైతుల సమస్య పరిష్కారం కావడమే మీకు కావాలా, లేక ఆ సమస్య పేరుతో రాజకీయ లబ్ధి పొందడమే మీ లక్ష్యమా?" అని వెంకటకృష్ణ ప్రశ్నించారు. గోవిందరావుపేట మండల రైతులకు సాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ములుగు జిల్లా కార్మిక శాఖా అధ్యక్షులు కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మద్దాల నాగమణి, జిల్లా అధికార ప్రతినిధి జెట్టి సోమయ్య, సీనియర్ నాయకులు కనతల నాగేందర్ రావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రసపుత్ సీతారామ్ నాయక్, జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు చింత క్రాంతి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు భుక్య రాజు, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు భైరి అభిలాష్, మాజీ ఎంపీటీసీ చాపల ఉమాదేవి, కాడబోయిన రవి, జిల్లా కార్యదర్శి జంపాల చంద్రశేఖర్, గణపాక సుధాకర్, తండా కృష్ణ, రామచంద్రపు వెంకటేశ్వర్ రావు, సర్పంచ్ లావుడ్యా జోగా, రేగుల లక్ష్మణ్, ఇర్ప విజయ, గోపిదాసు వజ్రమ్మ తదితర నాయకులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి

**ప్రత్యేక ప్రచార దినాల్లో ఓటరు జాబితా సేవలను సద్వినియోగం చేసుకోవాలి.**

**ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి.**



గోవిందరావుపేట, సెప్టెంబర్ 5( నారద)అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని,
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ లో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రచార దినాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి కోరారు. శనివారం ప్రత్యేక ప్రచార దినం సందర్భంగా గోవిందరావుపేట మండల ంలోని గోవిందరావుపేట, చల్వాయి, తాడ్వాయి మండలంలోని తాడ్వాయి, కాటాపూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో కృష్ణవేణి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న ఓటర్ల ముసాయిదా జాబితాలు, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించి బూత్ స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు, వివరాల సవరణలకు సంబంధించిన దరఖాస్తులు, అభ్యంతరా లను నిర్ణీత నమూనా పత్రాల్లో స్వీకరించాలని ఆదేశించారు. అర్హులైన ఏ ఒక్కరూ ఓటరుగా నమోదు కాకుండా మిగిలిపోకుండా బూత్ స్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సెప్టెంబర్ 6, 12, 13 తేదీల్లో కూడా ప్రత్యేక ప్రచార దినాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా తేదీల్లో బూత్ స్థాయి అధికారులు సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండి ఓటర్లకు సహకరి స్తారని పేర్కొన్నారు. ప్రజలు తమ పోలింగ్ కేంద్రాలను సందర్శించి నిర్ణీత గడువులో దరఖాస్తులు, అభ్యంతరాలను సమర్పించాలని కోరారు.
నూతన ఓటరు నమోదుకు నమూనా--6, ఓటర్ల జాబితా నుంచి పేరు తొలగించేందుకు నమూనా--7, వివరాల సవరణకు నమూనా--8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 2026 అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండే యువతీ యువకులు నిర్ణీత ప్రకటన పత్రంతోపాటు నమూనా--6ను సమీపంలోని బూత్ స్థాయి అధికారికి సమర్పించి ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.

అభ్యుదయం
The Pride of Telugu national daily



# ఏడుగురు ఆటగాళ్ళపై పాకిస్థాన్ వేటు



ఇంగ్లండ్ జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో పాకిస్థాన్ జట్టు చిత్తుగా ఓడిపోయింది. దీంతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు జట్టు ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. ఇందులోభాగంగా, జట్టులో పెను మార్పులకు శ్రీకారం చుడుతూ, ఏకంగా ఏడుగురు ఆటగాళ్ళపై వేటు వేసింది. ఇంగ్లండ్‌తో లార్డ్స్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో పాక్ జట్టు 194 పరుగుల తేడాతో చిత్తుగా ఓడిపోయింది. దీంతో సిరీస్ మధ్యలోనే సమూల మార్పులు చేపడుతూ ఏకంగా ఏడుగురు ఆటగాళ్లను జట్టు నుంచి తప్పించింది. అలాగే, రెడ్-బాల్ కోచింగ్ సిబ్బందిపై కూడా వేటు వేసింది. వికెట్ కీపర్ మహమ్మద్ రిజ్వాన్, ఓపెనర్ ఇమామ్-ఉల్-హక్, పరిమిత ఓవర్ల క్రికెట్ మాజీ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘాతో పాటు అలీ ఉస్మాన్, అమీర్ జమాల్, ముహమ్మద్ అవైస్ జాఫర్, ఖుర్రం షాజాద్లను జట్టు నుంచి విడుదల చేస్తున్నట్లు పీసీబీ ప్రకటించింది. వీరి స్థానంలో ఏడుగురు కొత్త ఆటగాళ్లను ఎంపిక చేసింది. వీరిలో సైమ్ అయూబ్, అబ్దుల్లా ఫజల్లకు టెస్ట్ అనుభవం ఉండగా, అరాఫత్ మిన్హాస్, మహమ్మద్ ఇమ్రాన్ జూనియర్, సాద్ బేగ్, మహమ్మద్ ఇమ్రాన్, రజావుల్లాలకు తొలిసారిగా టెస్ట్ జట్టులో చోటు లభించింది. ఆటగాళ్లపైనే కాకుండా కోచింగ్ సిబ్బందిలోనూ మార్పులు చేసింది. టెస్ట్ క్రికెట్ హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌ను బాధ్యతల నుంచి తప్పించింది. వారి స్థానంలో ఈ పర్యటన ముగిసే వరకు వైట్-బాల్ కోచ్ మైక్ హెసన్, యాష్లే నోఫ్కేలకు అదనపు బాధ్యతలు అప్పగించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో పాకిస్థాన్ ఇప్పటికే 0-2తో వెనుకబడగా.. ఆటగాళ్ల పేలవ ఫామ్, గాయాల వివాదాలే ఈ మార్పులకు ప్రధాన కారణమని తెలుస్తోంది. కాగా, ఇరు జట్ల మధ్య మూడో టెస్ట్ మ్యాచ్ ఈ నెల 9వ తేదీ నుంచి ప్రారంభంకానుంది.

# సీఎస్కే కెప్టెన్ మార్పు తప్పదా?






జట్టు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత సారథి రుతురాజ్ గైక్వాడ్‌ను తప్పించి, వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్‌కు పగ్గాలు అప్పగించాలని ఫ్రాంచైజీకి సూచించారు. గత మూడు సీజన్లుగా చెన్నై సూపర్ కింగ్స్ వరుసగా ప్లేఆఫ్స్ అర్హత సాధించడంలో విఫలమైంది. మరోవైపు 2026 సీజన్‌లో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ వ్యక్తిగత ప్రదర్శన కూడా తీవ్ర విమర్శలకు దారితీసింది. పవర్‌ప్లేలో అత్యంత తక్కువ స్ట్రైక్ రేట్ నమోదు చేసిన బ్యాటర్‌గా నిలిచిన రుతురాజ్, 28 సగటుతో కేవలం 337 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఈ క్రమంలో శాంసన్ జట్టులోకి రావడంతో నాయకత్వ బాధ్యతలు ఆయనకే అప్పగించాలనే డిమాండ్లు బలంగా వినిపిస్తున్నాయి. సీఎస్కే ఎప్పుడూ స్థిరత్వానికి ప్రాధాన్యమిస్తుందని, తొందరపాటు నిర్ణయాలు తీసుకోదని గుర్తుచేసిన రమేశ్.. తాజా పరిస్థితుల దృష్ట్యా మార్పు అనివార్యమని పేర్కొన్నారు. తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా మాట్లాడిన ఆయన.. "కెప్టెన్సీ మార్పు అవసరమా లేదా అనే అంశంపై సీఎస్కే పలు ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నట్లు కనిపిస్తోంది. సంజూ శాంసన్ ఒక అద్భుతమైన టీమ్ ప్లేయర్ కాబట్టి అతడి పేరును తప్పక పరిగణనలోకి తీసుకోవాలి.

ఒకవేళ కెప్టెన్సీని మార్చాలనుకుంటే శాంసన్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి. ఐపీఎల్‌లో 66 మ్యాచ్‌లకు సారథ్యం వహించిన సంజూ 33 విజయాలు సాధించి, 50 శాతం విజయాల రేటును కలిగి ఉన్నాడు. అతని కెప్టెన్సీలోనే రాజస్థాన్ రాయల్స్ ఫైనల్‌కు చేరడంతో పాటు మరోసారి ప్లేఆఫ్స్‌కు చేరుకుంది. అయితే కేవలం సంజూను కెప్టెన్ చేసినంత మాత్రాన ట్రోఫీ గెలవలేరు, జట్టులో మరికొన్ని అంశాలను కూడా మార్చాల్సి ఉంది" అని విశ్లేషించారు. మరోవైపు మాజీ క్రికెటర్ సుబ్రమణ్యం బద్రీనాథ్ కూడా గతంలో ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. "రుతురాజ్ నుంచి కెప్టెన్సీ బాధ్యతలను తప్పిస్తే అతడు బ్యాటర్‌గా మరింత స్వేచ్ఛగా, మెరుగ్గా రాణించగలడు. అతనిపై నుంచి నాయకత్వ భారాన్ని తొలగించడం ఎలాంటి కఠిన నిర్ణయం కాదు. అది ఆటగాడితో పాటు ఫ్రాంచైజీకి కూడా మేలు చేస్తుంది" అని బద్రీనాథ్ పేర్కొన్నారు.

# ప్రిన్స్ యాదవ్ పై బీసీసీఐ ఫోకస్!




ఇండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా రీఎంట్రీపై ఇంకా సస్పెన్స్ కొనసాగుతోంది. బీసీసీఐ మెడికల్ టీమ్ నుంచి అతడికి ఇప్పటివరకు ఫిట్‌నెస్ క్లియరెన్స్ రాలేదు. రాబోయే అఫ్గానిస్థాన్ టీ20 సిరీస్, 2026 ఏషియన్ గేమ్స్ కోసం ఎంపిక చేసిన స్క్వాడ్స్‌లో బుమ్రా పేరు ఉన్నా, అతడి పాల్గొనడం ఫిట్‌నెస్‌పై ఆధారపడి ఉంటుందని సమాచారం. ఇంగ్లాండ్‌తో జూలై 16న జరిగిన రెండో వన్డేలో బుమ్రా మోకాలికి మరోసారి ఇబ్బంది ఎదురైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొంతకాలంగా వేధిస్తున్న మోకాలి సమస్య మరింత పెరిగినట్లు సమాచారం. ఆ మ్యాచ్ తర్వాత అతడు బౌలింగ్ చేయలేదు. ప్రస్తుతం రికవరీ ప్రక్రియ కొనసాగుతోంది. తను టీమిండియా లోకి ఎప్పుడు వస్తాననేది మిలియన్ డాలర్ ప్రశ్నగా మారింది. బుమ్రా రీఎంట్రీ తేదీపై స్పష్టత లేకపోవడంతో సెలెక్టర్లు బ్యాకప్ ప్లాన్‌పై దృష్టి పెట్టినట్లు తాజా నివేదిక పేర్కొంది. ఈ క్రమంలో పేసర్ ప్రిన్స్ యాదవ్‌ను ప్రాబబుల్ బ్యాకప్‌గా గుర్తించినట్లు సమాచారం. బుమ్రాతో పాటు నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణా కూడా ఫిట్‌నెస్ పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలుస్తోంది. వీరికి వారం రోజుల పాటు మ్యాచ్ సిమ్యులేషన్ టెస్టులు నిర్వహించే అవకాశం ఉంది. ఈ పరీక్షల్లో ఫిట్‌నెస్ నిరూపించుకున్న తర్వాత సెప్టెంబర్ 10న ఢిల్లీ చేరే టీమ్‌తో కలిసే అవకాశం ఉంటుందని బోర్డు వర్గాలు పేర్కొంటున్నాయి.బుమ్రా విషయంలో టీమ్



మేనేజ్‌మెంట్ వ్యవహరిస్తున్న తీరుపై మాజీ ఇండియా బ్యాటర్ సుబ్రమణ్యం బద్రీనాథ్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. గత ఏడాది జనవరిలో బుమ్రాకు ఎదురైన వెన్ను గాయం తర్వాత అతడి వర్క్‌లోడ్‌ను జాగ్రత్తగా మేనేజ్ చేస్తున్నా, వరుసగా ఫిట్‌నెస్ సమస్యలు రావడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నాడు. బుమ్రా విషయంలో నిర్ణయాలు తీసుకునేది కెప్టెన్, కోచ్, సెలెక్టర్లేనని, అయినప్పటికీ తను టీమిండియాలో రెగ్యులర్ గా ఆడటం లేదని బద్రీనాథ్ అన్నాడు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేవలం ఆటగాడి శారీరక పరిస్థితి, అతడు ఏ మ్యాచ్‌లకు ఆడే స్థితిలో ఉన్నాడో సమాచారాన్ని మాత్రమే అందిస్తుందని తెలిపాడు. బుమ్రా ఒక్కడే కాదు. నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్, సాయి సుదర్శన్ కూడా ప్రస్తుతం గాయాల కారణంగా ఆటకు దూరంగా ఉన్నారు. దీంతో కీలక సిరీస్‌లకు ముందు ఇండియా టీమ్ ఫిట్‌నెస్ పరిస్థితిపై ఆసక్తి నెలకొంది. మరోవైపు ప్రపంచకప్ మరో ఏడాది మాత్రమే సమయం ఉండటంతో బుమ్రా ఫిట్ నెస్ సాధించకపోవడం, తరచూ గాయపడుతుండటంపై భారత అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# భారత్--జపాన్ మధ్య చారిత్రాత్మక పోరు..

క్రికెట్ పిచ్ పై భారత్ జపాన్ ఫ్రెండ్ షిప్..

భారత్, జపాన్ దేశాల మధ్య 75 సంవత్సరాల ద్వైపాక్షిక దౌత్య సంబంధాల వేడుకలను పురస్కరించుకుని ఇరు దేశాల పురుషుల జట్లు ప్రత్యేక అంతర్జాతీయ టీ20 మ్యాచ్ లో పాల్గొననున్నాయి. ఈ మ్యాచ్ కోసం 'సుజుకి కప్' ను నిర్వహించనున్నట్లు జపాన్ క్రికెట్ అసోసియేషన్ (జేసీఏ), భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సంయుక్తంగా అధికారిక ప్రకటన చేశాయి. జపాన్‌లోని తోచిగి ప్రిఫెక్చర్‌లో ఉన్న సానో ఇంటర్నేషనల్ క్రికెట్ గ్రౌండ్ వేదికగా సెప్టెంబర్ 22న ఈ చారిత్రాత్మక పోరును నిర్వహించనున్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని సనాయ్ తకైచిల మధ్య జరిగిన ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశంలో కుదిరిన ఒప్పందం మేరకు 'స్పోర్ట్ 75' పేరుతో ఈ క్రీడా సంబంధాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 2036 ఒలింపిక్స్, పారాలింపిక్స్ ఆతిథ్య హక్కుల కోసం ఇండియా చేస్తున్న ప్రయత్నాలకు కూడా ఈ భాగస్వామ్యం ఊతమివ్వనుంది. ఆ సమయంలో జపాన్ వేదికగా జరిగే ఏషియన్ గేమ్స్ లో పాల్గొనే భారత పురుషుల జట్టులోని స్టార్ క్రికెటర్లు వైభవ్ సూర్యవంశీ, శ్రేయస్ అయ్యర్ వంటి ఆటగాళ్లు ఈ చారిత్రక మ్యాచ్ లో బరిలోకి ఆడనున్నారు. ఈ విశేష సందర్భంపై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా




స్పందిస్తూ, "ఈ అరుదైన మ్యాచ్ లో భాగస్వామి కావడం బీసీసీఐకి ఎంతో సంతోషాన్నిస్తోంది. భారత జట్టు సరికొత్త గడ్డపై అడుగుపెట్టడానికి, జపాన్ తో పాటు తూర్పు ఆసియా ప్రాంతంలో క్రికెట్ ను మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి ఇదొక గొప్ప అవకాశం. ఇరు దేశాల మధ్య ఉన్న చిరకాల మైత్రికి ఈ మ్యాచ్ మరింత వన్నె తెస్తుంది

. సంప్రదాయ క్రికెట్ దేశాలకు ఆవల కూడా ఆటను విస్తరించడం ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ బోర్డుగా బీసీసీఐ బాధ్యత" అని తెలిపారు. ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ జట్టును జపాన్ హోమ్ గ్రౌండ్‌కు ఆహ్వానించడం తమ అసోసియేషన్‌కు దక్కిన గౌరవమని జపాన్ క్రికెట్ అసోసియేషన్ సీఈవో నవోకి అలెక్స్ మియాజీ పేర్కొన్నాడు. "భారత క్రికెట్ అభిమానుల ఉత్సాహాన్ని స్వాగతిం చడానికి మేం సిద్ధంగా ఉన్నాం. జపాన్ ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో స్టేడియానికి వచ్చి ఆటను ఆస్వాదించి మా జట్టును ప్రోత్సహించాలి" అని అతడు వ్యాఖ్యానించాడు. ఈ ప్రత్యేక పోరు ద్వారా ఈస్ట్ ఆసియా మార్కెట్ లో క్రికెట్ క్రేజ్ ను పెంచడానికి బీసీసీఐ, జేసీఏ పక్కా ప్రణాళికలతో ముందుకు సాగుతున్నాయని తెలుస్తోంది. రాబోయే కాలంలో జపాన్ లో క్రికెట్ మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేసేందుకు బీసీసీఐ సాంకేతిక సహకారాన్ని కూడా అందించనుంది.

# మహమ్మద్ షమీని ధీటుగా ఎదుర్కొంటాం

## సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మ వెల్లడి

దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్ కోసం అన్ని విధాల సిద్ధమయ్యామని సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మ తెలిపాడు. మహమ్మద్ షమీని సమర్థవంతంగా ఎదుర్కొంటామని ధీమా వ్యక్తం చేశాడు. ఆదివారం చెన్నై వేదికగా ప్రారంభమయ్యే దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఇషాన్ కిషన్ సారథ్యంలో ఈస్ట్ జోన్‌తో సౌత్ జోన్ అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో శనివారం మీడియా సమావేశంలో పాల్గొన్న తిలక్ వర్మ.. సౌత్ జోన్ తరఫున కేఎల్ రాహుల్ ఆడటం లేదని స్పష్టం చేశాడు. దేవదత్ పడిక్కల్‌తో పాటు సిరాజ్ బరిలోకి దిగుతున్నారని చెప్పాడు. 'సీనియర్ పేసర్ మహమ్మద్ షమీని అడ్డుకునేందుకు సిద్ధంగానే ఉన్నాం. ఈ మ్యాచ్ రసవత్తరంగానే ఉండబోతుంది. గత మ్యాచ్‌లో షమీ ఎలా బౌలింగ్ చేశాడో మేం గమనించాం. బ్యాటర్లను ఇబ్బంది పెడుతూ లైన్ అండ్ లెంగ్త్‌తో కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తాడు. అతని బౌలింగ్‌ను ఎదుర్కొని సత్తా చాటుతాం. కేఎల్ రాహుల్ ఈ మ్యాచ్ ఆడటం లేదు.'అని తిలక్ వర్మ తెలిపాడు. 54 ఏళ్ల తర్వాత దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్, ఈస్ట్ జోన్ తలపడుతున్నాయి. ఈ ఇరు జట్లు దులీప్ ట్రోఫీ ఫైనల్లో తలపడటం ఇది రెండోసారి మాత్రం. చివరి సారిగా 1970-71 సీజన్‌లో ముంబైలోని బ్రాబోర్న్ స్టేడియంలో తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో సౌత్ జోన్ 10 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఓవరాల్‌గా సౌత్ జోన్ దులీప్ ట్రోఫీ ఫైనల్ చేరడం ఇది 24వ సారి. ఇప్పటి వరకు సౌత్ జోన్ 13 టైటిళ్లు గెలిచింది. మరోవైపు 13 ఏళ్ల తర్వాత ఫైనల్ చేరిన ఈస్ట్ జోన్.. చివరి సారిగా 2012-13 సీజన్‌లో టైటిల్ పోరుకు అర్హత సాధించింది. ఇప్పటి వరకు 8 సార్లు ఫైనల్ చేరిన ఈస్ట్ జోన్ రెండు టైటిళ్లు మాత్రమే గెలిచింది. ఈ ఫైనల్ మ్యాచ్‌కు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ హాజరుకానున్నాడు. అతని



పదవీకాలంపై ఇటీవల పెద్ద చర్చే జరిగింది. అక్టోబర్ 4 వరకు ఉన్నప్పటికీ.. వచ్చే ఏడాది ప్రపంచకప్ వరకు పొడిగించే అవకాశం ఉంది. ఈ విషయంపై చెన్నైలో బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా-అగార్కర్ మధ్య సమావేశం జరగనుంది. ఇటీవల బీసీసీఐ నిర్వహించిన రివ్యూ మీటింగ్‌కు అగార్కర్ హాజరు కాలేదు. వ్యక్తిగత కారణాల వల్ల అతను ఈ మీటింగ్‌కు దూరంగా ఉన్నాడు. ఆసియా గేమ్స్ కోసం నెట్ బౌలర్లను ఎంపిక చేయనున్నారు.

## సంపాదకీయం

# విద్యా రంగానికే జీవితం అంకితం



సర్వేపల్లి రాధాకృష్ణ (1888 సెప్టెంబరు 5 – 1975 ఏప్రిల్ 17) 1962 నుండి 1967 వరకు భారతదేశానికి రెండవ రాష్ట్రపతిగా పనిచేసిన భారతీయ రాజకీయవేత్త, తత్వవేత్త, రాజనీతిజ్ఞుడు. గతంలో 1952 నుండి 1962 వరకు భారతదేశానికి మొదటి ఉపరాష్ట్రపతిగా పనిచేశాడు. 1949 నుండి 1952 వరకు సోవియట్ యూనియన్‌లో భారతదేశానికి రెండవ రాయబారిగా ఉన్నాడు. 1939 నుండి 1948 వరకు బెనారస్ హిందూ విశ్వవిద్యాలయానికి నాల్గవ వైస్–ఛాన్సలర్‌గా, 1931 నుండి 1936 వరకు ఆంధ్ర విశ్వవిద్యాలయానికి రెండవ వైస్–ఛాన్సలర్‌గా కూడా ఉన్నాడు. రాధాకృష్ణన్ తులనాత్మక మతం, తత్వశాస్త్రం యొక్క 20వ శతాబ్దపు అత్యంత ప్రభావవంతమైన, విశిష్టమైన పండితులలో ఒకరిగా పరిగణించబడ్డాడు.ళ1ర ళ2ర ఆయన కలకత్తా విశ్వవిద్యాలయంలో కింగ్ జార్జ్ వి చైర్ ఆఫ్ మెంటల్ అండ్ మోరల్ సైన్స్‌లో 1921 నుండి 1932 వరకు, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో స్పాల్డింగ్ చైర్ ఆఫ్ ఈస్టర్న్ రెలిజియన్ అండ్ ఎథిక్స్ కు 1936 నుండి 1952 వరకు తన సేవలనందించాడు.ళ3ర భారతీయ తాత్వికచింతనలో పాశ్చాత్య తత్వాన్ని ప్రవేశ పెట్టారని ప్రతీతి. రెండు పర్యాయాలు ఉపరాష్ట్రపతి పదవి చేపట్టి, తరువాత రాష్ట్రపతిగా ఒక పర్యాయం పదవిని చేపట్టి, భారతదేశపు అత్యంత క్లిష్టకాలంలో (చైనా, పాకిస్తాన్లతో యుద్ధ సమయం) ప్రధానులకు మార్గనిర్దేశం చేశాడు. డాక్టర్ రాధాకృష్ణన్ కేవలం ఒక రాష్ట్రపతి మాత్రమే కాదు. తన జీవితంలో ఎక్కువ భాగాన్ని విద్యా రంగానికే అంకితం చేసిన నిబద్ధత కలిగిన ఉపాధ్యాయుడు, ప్రఖ్యాత తత్వవేత్త. ఆయన అనేక విద్యాసంస్థల్లో తత్వశాస్త్ర బోధకుడిగా పనిచేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయాలకు వైస్–ఛాన్సలర్‌గా విశిష్ట సేవలందించారు. ఆ తర్వాత స్వతంత్ర భారత దేశపు మొట్టమొదటి ఉపరాష్ట్రపతిగా, అనంతరం రెండవ రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వర్తించారు. విద్య గురించి ఆయన వ్యక్తపరిచిన ఆలోచనలు నేటికీ ఎంతో ప్రాసంగికమైనవి. గతంలో ఒక ఉపాధ్యాయ దినోత్సవ ప్రసంగంలో మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ డాక్టర్ రాధాకృష్ణన్ సూక్తిని గుర్తుచేసుకుంటూ.. "విద్య యొక్క అంతిమ లక్ష్యం కేవలం సమాచారాన్ని సేకరించడం మాత్రమే కాదు... మనలను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దే మానసిక పరిపక్వతను, హేతుబద్ధమైన ఆలోచనా దృక్పథాన్ని, ప్రజాస్వామ్య స్ఫూర్తిని పెంపొందించడమే." అని పర్కొన్నారు. ఈ ఉన్నతమైన ఆలోచనే రాధాకృష్ణన్‌ను ఈ దినోత్సవానికి నిరంతర ప్రేరణగా నిలబెట్టింది. ఆయన దృష్టిలో విద్య అంటే కేవలం పాఠ్యపుస్తకాలు, పరీక్షలు లేదా సాంకేతిక నైపుణ్యాలకే పరిమితం కాదుజ.. విద్యార్థుల్లో స్వతంత్ర ఆలోచనా శక్తి, తార్కిక దృష్టి, బాధ్యతాయుత పౌర భావాలను పెంపొందించడమే నిజమైన విద్య. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే, 1948లో కేంద్ర ప్రభుత్వం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అధ్యక్షతన ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయ విద్యా కమిషన్ (యూనివర్సిటీ ఎడ్యుకేషన్ కమిషన్)ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ దేశంలోని విశ్వవిద్యాలయ విద్య తీరుతెన్నులను కూలంకషంగా పరిశీలించి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కీలక మార్పులను సూచించింది. స్వతంత్ర భారతంలో ఉన్నత విద్యా వ్యవస్థ అభివృద్ధికి ఈ నివేదిక ఒక బలమైన పునాదిగా నిలిచింది. విశ్వవిద్యాలయ విద్య నిర్మాణం, బోధనా ప్రమాణాలు, పరిశోధనలు మరియు విద్యా నిర్వహణ వంటి రంగాలపై ఈ కమిషన్ సిఫార్సులు తీవ్ర ప్రభావాన్ని చూపాయి. తర్వాతి కాలంలో వచ్చిన కొఠారి కమిషన్ నివేదికతో పాటు, రాధాకృష్ణన్ కమిషన్ ఇచ్చిన 1948–49 నాటి నివేదిక దేశ విద్యా విధానాల రూపకల్పనకు మూలస్తంభంగా నిలిచిందని ప్రభుత్వ పత్రాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుత విద్యాసంస్థలకు ఇచ్చే "డీమ్డ్ విశ్వవిద్యాలయాల" హోదా అనే భావన కూడా రాధాకృష్ణన్ కమిషన్ సిఫార్సుల నుంచే ఉద్భవించింది. ఉపాధ్యాయ దినోత్సవం 2026 సందర్భంగా దేశ రాజధాని న్యూఢిల్లీలో జాతీయ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవం జరగనుంది. పాఠశాల విద్యా రంగానికి విశేష సేవలందించిన 48 మంది ఉపాధ్యాయులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సెప్టెంబర్ 5న ఈ ప్రతిష్టాత్మక పురస్కారాలను అందజేయనున్నారు. ఈ పురస్కార గ్రహీతలను జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో మూడు దశల పారదర్శక ప్రక్రియ ద్వారా ఎంపిక చేశారు.

వీరు దేశంలోని 27 రాష్ట్రాలు, 7 కేంద్రపాలిత ప్రాంతాలు, ఆరు కేంద్ర ప్రభుత్వ సంస్థల పరిధికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పాఠశాల విద్య నాణ్యతను పెంచి, తమ బోధన ద్వారా విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను గుర్తించి సత్కరించేందుకు భారత ప్రభుత్వం 1958లో జాతీయ ఉపాధ్యాయ అవార్డులను ప్రారంభించింది. భారతదేశంలో జరుపుకునే ఉపాధ్యాయ దినోత్సవానికి, ప్రపంచవ్యాప్తంగా నిర్వహించే అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవానికి మధ్య తేడా ఉంది. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఏటా అక్టోబర్ 5న నిర్వహిస్తారు.

# గురువులు దైవంతో సమానం

### సమాజ ప్రగతికి బాటలు వేస్తున్న ఉపాధ్యాయులు సేవలు చిరస్మరణీయం,

### డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఘన నివాళులు.



ఏలూరు, సెప్టెంబరు 05 విద్యార్థులు భవిష్యత్తును బంగారుబాటలుగా తీర్చిదిద్దుతున్న గురువులు దైవంతో సమానం అన్నారు ఏలూరు జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి. ఉపాధ్యాయదినోత్సవం సందర్భంగా 33 మంది ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలకు ప్రశంస పత్రాలు, జ్ఞాపికలు, శాలువాలు, పండ్లను ఇచ్చి ఘనంగా సత్కరించారు. స్థానిక జిల్లా పరిషత్తు సమావేశం మందిరంలో భారతరత్న భారత మాజీ రాష్ట్రపతి డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి)లు పూలదడలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ఆదర్శ గురువులు భారతరత్న మాజీ రాష్ట్రపతి డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయులందరికీ ఆదర్శనీయులు అన్నారు. ఆదర్శ ఉపాధ్యాయులుగా, ఉపరాష్ట్రపతిగా అనంతరం రాష్ట్రపతిగా పనిచేసి విద్యావ్యవస్థలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిన మహనీయులు పుట్టినరోజుని మనందరం ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటు న్నామన్నారు. విద్యార్థులు జ్ఞానాన్ని అందించి సంఘంలో ఒక గౌరవనీయ వ్యక్తిగా తీర్చిదిద్దడంలో గురువులు పాత్ర అపారమైనదని అన్నారు. విద్యార్థులకు కేవలం చదువు, జ్ఞానం మాత్రమే కాకుండా సమాజంలో జీవించడానికి కావలసిన సోషల్ స్కిల్స్, ధైర్యము, సహనం, ఓర్పు ఇలాంటి ఎన్నో అమూల్యమైనవి విద్యార్థులకు అందిస్తున్నారని అన్నారు. జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు పాత్ర ఎంతో కీలకమని, విద్యార్థులకు విద్యతో పాటు విలువలు నేర్పించడం చాలా అవసరమని అన్నారు. క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను అందిస్తూ బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు సేవలు అభినందనీయం అన్నారు.

ఉపాధ్యాయులు సేవలను గుర్తించి వారిని ప్రోత్సహించడం ద్వారా మరింత నిబద్ధతతో పనిచేసే స్ఫూర్తి కలుగుతుందన్నారు. విద్యార్థి దశలో మంచి కన్నా చెడును త్వరగా గ్రహిస్తారని ఈ విషయాన్ని గమనించి మంచి మార్గం వైపు మళ్ళించాలన్నారు. విద్యార్థులకు పాఠాలు చెప్పడంతో పాటు విషయ పరిజ్ఞానాన్ని నేర్పించి వారు ఆకలింపు చేసుకునేలా గురువులు తీర్చిదిద్దాలన్నారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య( చంటి) మాట్లాడుతూ జన్మనిచ్చిన తల్లిదండ్రులు తర్వాత సరైన మార్గంలో నడిపించేది గురువు ఒక్కరేనని అన్నారు. ఆ గురువుకి మనమందరం కూడా శిరస్సు వంచి నమస్కరించాలని అన్నారు. గురువు అంటే దైవంతో సమానం అని, విద్యార్థికి సరైన నడకని బాటని వేసి మంచి సంస్కృతి సంప్రదాయాలను అలవర్చి ఉత్తమ విద్యార్థిగా తీర్చిదిద్దే గురువు పాత్ర చాలా అమోఘమైనదని అన్నారు.

జిల్లా విద్యాశాఖ అధికారి యం.వెంకటలక్ష్మమ్మ, పరీక్షలు నిర్వహణ సహాయ కమిషనరు ఆర్.ఆశ, ఉప విద్యాశాఖ అధికారులు డా.పి. యస్.సుధాకర్, యన్.రవీంద్ర భారతి, జిల్లా పరిషత్తు, విద్యాశాఖ అధికారులు, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలు వారి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. ముందుగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

# ఈనెల 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు

### అధికారులకు కీలక సూచనలు చేసిన స్పీకర్, ఛైర్మన్?

సోమవారం నుంచి తెలంగాణ అసెంబ్లీ, శాసనమండలి వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సభ లోపల, బయట ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశించారు. సభ్యులు కోరిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలని అధికారులకు సూచించారు. సమావేశాల నిర్వహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్? కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి శాసన వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ అధికారులు, డీజీపీ, పోలీసు ఉన్నతాధికారులు హాజరయ్యారు. గత సమావేశాల కంటే వేగంగా, సమన్వయంతో పనిచేయాలని అధికారులకు ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. ఈసారి అసెంబ్లీ సమావేశాలు హాట్ హాట్‌గా జరిగే అవకాశం ఉందని గుత్తా అన్నారు. సభకు సంబంధించిన అన్ని శాఖల అధికారులు సమావేశాల సమయంలో అందుబాటులో ఉండాలని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి? ఆదేశించారు. సభ్యులకు అందించే మెటీరియల్‌ను తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో ముందుగానే అందించాలని సూచించారు. సభ లోపల, బయట ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పీకర్, ఛైర్మన్? ఆదేశాలు జారీ చేశారు. ధర్నాలు, రాస్తారోకోలు జరగకుండా పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటెలిజెన్స్ సమాచారం వేగంగా అసెంబ్లీ అధికారులకు చేరేలా సమన్వయం చేయాలని ఆదేశించారు. సమావేశాల నిర్వహణ కోసం నోడల్ అధికారులను నియమించాలన్నారు. సభ్యుల ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలను ఒకరోజు ముందే అందించాలని అధికారులను మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. ప్రతి శాఖ నుంచి ఒక అధికారి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఉభయ సభల సమావేశాలు ప్రభుత్వ కార్యనిర్వాహక వ్యవస్థ సమర్థతకు నిదర్శనమని శ్రీధర్ బాబు అన్నారు. ప్రభుత్వం తరపున సమావేశాలకు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు. ఈ వర్షాకాల సమావేశాల్లో పలు కీలక బిల్లులు ప్రవేశపెట్టడంతో పాటు, ప్రజలు ఎదుర్కొంటున్న పలు ముఖ్యమైన సమస్యలపై



సుదీర్ఘంగా చర్చించే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు, ప్రజా సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు విపక్షాలు కూడా సిద్ధమవుతున్నాయి. దీంతో ఈసారి వర్షాకాల సమావేశాలు వాడీవేడిగా సాగే సూచనలు కనిపిస్తున్నాయి. వర్షాకాల సమావేశాలు ఎన్ని రోజుల పాటు కొనసాగుతాయనేది బిజినెస్ అడ్వైజరీ కమిటీ–బీఏసీ సమావేశంలో నిర్ణయించనున్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, కొత్త బిల్లుల ఆమోదం లాంటివి ప్రభుత్వ అజెండాగా ఉంటాయి.

# కాకతీయ విశ్వవిద్యాలయంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

### విద్యార్థులు క్రమశిక్షణతో విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలి: ప్రొఫెసర్ పెదమళ్ళ శ్రీనివాసరావు

హన్మకొండ, 5 సెప్టెంబర్

కాకతీయ విశ్వవిద్యాలయంలోని ప్రభుత్వ పాలన మరియు మానవ వనరుల నిర్వహణ విభాగంలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విభాగం అధిపతి ప్రొఫెసర్ పెదమళ్ళ శ్రీనివాసరావుతో పాటు విభాగంలోని అధ్యాపకులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విభాగం అధిపతి ప్రొఫెసర్ పెదమళ్ళ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరవుతూ విద్యాభ్యాసంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు అంకితభావం, క్రమశిక్షణతో ముందుకు



సాగుతూ తమ విషయ పరిజ్ఞానాన్ని నిరంతరం పెంపొందించుకోవాలని అన్నారు. ఉన్నత విద్య ద్వారా సాధించగల అవకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకులుగా నిలుస్తారని, విద్యార్థులు అధ్యాపకుల సూచనలు, సలహాలను పాటిస్తూ విద్యా, పరిశోధనా రంగాల్లో రాణించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో విభాగం అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు పాల్గొని ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.



# తుస్సుమన్న కోల్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టు!

న్యూఢిల్లీ: దేశంలో భారీగా ఉన్న బొగ్గు, లిగ్నైట్ నిక్షేపాల్లో కొంత భాగాన్ని సింథటిక్ గ్యాస్ (సిన్‌గ్యాస్)గా మార్చాలన్న ప్రభుత్వ ప్రయత్నం ఫలించేలా లేదు. ఇందుకు ఆసక్తి ఉన్న కంపెనీలు ఈ నెల 7వ తేదీ లోగా తమ బిడ్స్‌ను సమర్పించాలని కేంద్ర బొగ్గు గనులు మంత్రిత్వ శాఖ ఈ ఏడాది జూలై 7వ తేదీన నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందుకు ముందుకు వచ్చే కంపెనీలకు అవసరమైన ఆర్థిక ప్రోత్సాహకాలు అందించేందుకు రూ.37,500 కోట్లతో ప్రత్యేక నిధిని కూడా ఏర్పాటు చేసింది. అయితే ఈ పథకం కింద కోల్ గ్యాసిఫికేషన్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు ఇప్పటి వరకు ఒక్క కంపెనీ నుంచి కూడా ప్రతిపాదన (బిడ్) అందలేదని అధికార వర్గాలు చెప్పాయి. దీంతో కోల్ గ్యాసిఫికేషన్‌తో ఎల్ఎన్‌జీ, ఎరువులు, కొన్ని కీలక రసాయనాల దిగుమతులకు చెక్ పెట్టాలన్న ప్రభుత్వ ప్రయత్నాలు ఫలించే సూచనలు కనిపించడం లేదు. సాంకేతిక సమస్యలతో పాటు ఈ ప్రాజెక్టులు గిట్టుబాటు అవుతాయో లేదోననే కంపెనీల అనుమానాలే ఇందుకు కారణమని భావిస్తున్నారు.

# మార్కెట్లోకి కియా సొరెంటో




న్యూఢిల్లీ: కియా ఇండియా.. ప్రీమియం ఎస్‌యూవీ సొరెంటోను మార్కెట్లోకి శుక్రవారం విడుదల చేసింది. హైబ్రిడ్, డీజిల్ వేరియంట్లలో అందుబాటులో ఉండే ఈఎస్‌యూవీ ప్రారంభ ధరలు రూ.27.99 లక్షల నుంచి రూ.40.39 లక్షల (ఎక్స్‌షోరూమ్) మధ్యన ఉన్నాయి. 1.6 లీటర్ పెట్రోల్-హైబ్రిడ్ ఇంజన్, 65 హెచ్‌పీ ఎలక్ట్రిక్ మోటార్, 2.2 లీటర్ డీజిల్ ఇంజన్‌తో తీసుకువచ్చింది. ఆల్-వీల్-డ్రైవ్ (ఏడబ్ల్యూడీ), లెవల్ 2ం ఏడీఏఎస్, పనోరోమిక్ సన్‌రూఫ్, రిమోట్ పార్కింగ్ అసిస్టెంట్ వంటి ఫీచర్లతో సొరెంటోను రూపొందించింది. టయోటా ఫార్చ్యూనర్, స్కోడా కొడియాక్, జీప్ మెరిడియన్ మోడళ్లకు ఈ వాహనం గట్టి పోటీనిస్తుందని అంచనా.

**100 శాతంఇథనాల్‌తో కియా సైరోస్లు**

ప్రత్యామ్నాయ ఇంధన సాంకేతికతలకు ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో కియా ఇండియా.. సైరోస్ ఫ్లెక్స్-ఫ్యూయల్ వెహికల్ కాన్సెప్ట్‌ను ఆవిష్కరించింది. దేశీయ మార్కెట్ కోసం కియా తీసుకువచ్చిన తొలి ఫ్లెక్స్-ఫ్యూయల్ ప్యాసింజర్ వాహనం ఇదే. ఈ కాంపాక్ట్ ఎస్‌యూవీ స్వచ్ఛమైన పెట్రోల్, 100 శాతం ఇథనాల్ లేదా రెండింటి మిశ్రమంతో నడిచేలా రూపొందించింది. కియా సైరోస్‌లో వివిధ స్థాయిల్లో ఇథనాల్ మిశ్రమాలకు అనుగుణంగా పనిచేసేలా ఇంజన్ కంట్రోల్ యూనిట్ (ఈసీయూ), ట్రాన్స్‌మిషన్ కంట్రోల్ యూనిట్ (టీసీయూ), ఫ్యూయల్ సిస్టమ్‌లో అవసరమైన మార్పులు చేశారు

# సాయంత్రం సమయంలో స్నాక్స్ తినాలని ఉంటే.. ఈ ఆరోగ్యకరమైన ఆహారాలను ఎంచుకోండి..

సాయంత్రం 5 గంటల సమయంలో ఆకలి వేయగానే చాలామంది వెంటనే ప్యాకెట్ స్నాక్స్, బిస్కెట్లు లేదా ఇతర ప్రాసెస్డ్ ఆహార పదార్థాల వైపు మొగ్గుచూపుతుంటారు. అయితే ఆకలిని తీర్చుకోవడానికి తప్పనిసరిగా ప్యాకెట్ ఫుడ్‌నే ఆశ్రయించాల్సిన అవసరం లేదు. మన ఇంటి వంటగదిలోనే ప్రోటీన్, ఫైబర్‌తో పాటు శరీరానికి అవసరమైన పోషకాలను అందించే ఎన్నో ఆరోగ్యకరమైన స్నాక్స్ ఉన్నాయి. వీటిని సులభంగా తయారు చేసుకోవచ్చు. వేయించిన శనగలు (భునా చనా) సాయంత్రం ఆకలి తీర్చుకోవడానికి మంచి ఎంపిక. ఇవి కరకరలాడుతూ ఉండడమే కాకుండా ప్రోటీన్, ఫైబర్‌కు మంచి వనరు. ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతిని కలిగించడంలో ఇవి సహాయపడతాయి. ఆఫీసులో లేదా ఇంట్లో చిన్న మొత్తంలో గాలి చొరబడని డబ్బాలో పెట్టుకుని తినవచ్చు. రుచికి కొద్దిగా నల్ల ఉప్పు, వేయించిన జీలకర్ర పొడి లేదా కారం కలుపుకోవచ్చు. అయితే పెద్ద ప్యాకెట్ నుంచి నేరుగా తినకుండా, ముందుగానే చిన్న పరిమాణంలో తీసుకోవడం మంచిది.



**మఖానా, పల్లీల చాట్..**

మఖానా, పల్లీలతో తయారు చేసే చాట్ కూడా సాయంత్రం వేళకు రుచికరమైన, పోషకమైన స్నాక్‌గా ఉపయోగపడుతుంది. ప్యాకెట్‌లో దొరికే ఎక్కువ ఉప్పు కలిగిన స్నాక్స్‌కు బదులుగా వేయించిన మఖానాను తీసుకోవచ్చు. వేరుశనగలు ఇందులో ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులను అందిస్తాయి. వేయించిన మఖానా, వేరుశనగలను కొద్దిగా నెయ్యి, అవసరమైన మసాలాలతో కలిపి సులభంగా చాట్‌లా తయారు చేసుకోవచ్చు. అయితే ఈ కాంబినేషన్‌ను ఎక్కువగా తినే అవకాశం ఉంటుంది కాబట్టి పరిమాణంపై నియంత్రణ అవసరం. ఒక గుప్పెడు సరిపోతుంది. ఆకలి ఎక్కువగా ఉన్నప్పుడు పనీర్ ముక్కలు కూడా సులభమైన ప్రోటీన్ రిచ్ స్నాక్‌గా ఉపయోగపడతాయి. పనీర్‌ను నేరుగా తినవచ్చు లేదా తవాపై స్వల్పంగా వేడి చేసి, కొద్దిగా మసాలా కలుపుకోవచ్చు. ఇందులోని ప్రోటీన్ కడుపు నిండిన అనుభూతిని పెంచడంలో సహాయపడటంతో పాటు భోజనాల మధ్య వచ్చే చిరుతిండి కోరికలను తగ్గించడంలో ఉపయోగపడతాయి. మొలకెత్తిన పెసలు కూడా పోషకాలు సమృద్ధిగా ఉండే మరో మంచి ఎంపిక. వీటిలో ప్రోటీన్, ఫైబర్‌తో పాటు పలు విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. ఉడికించిన పెసర మొలకలకు టమాటా, ఉల్లిపాయ, నిమ్మరసం, చాట్ మసాలా కలిపి త్వరగా చాట్ తయారు చేసుకోవచ్చు. ఇది తేలికగా, రుచికరంగా ఉండటంతో పాటు సాయంత్రం ఆకలిని తీర్చే పోషకమైన స్నాక్‌గా ఉపయోగపడుతుంది.

**సత్తు పానీయం..**

వేయించిన శనగపిండితో తయారయ్యే సత్తు పానీయం కూడా సాయంత్రం వేళకు మంచి ప్రత్యామ్నాయం. చల్లటి నీటిలో సత్తు, నిమ్మరసం, జీలకర్ర కలిపి సులభంగా తయారు చేసుకోవచ్చు. ఇది ప్రోటీన్, ఫైబర్‌ను అందించడంతో పాటు చక్కెర ఎక్కువగా ఉండే ప్యాకెట్ పానీయాలకు బదులుగా మరింత పోషకమైన ఎంపికగా నిలుస్తుంది. కాబట్టి సాయంత్రం 5 గంటల సమయంలో ఆకలి వేసినప్పుడు వెంటనే ప్యాకెట్ స్నాక్స్ వైపు వెళ్లాల్సిన అవసరం లేదు. భునా చనా, మఖానా-వేరుశనగ చాట్, పనీర్, మొలకలు, సత్తు వంటి మన దేశీయ ఆహార పదార్థాలతోనే రుచికరమైన, కడుపు నింపే, పోషకమైన సాయంత్రం స్నాక్స్‌ను సులభంగా సిద్ధం చేసుకోవచ్చు.

# దేశంలో పెరుగుతున్న ఫ్యాటీ లివర్ సమస్య వ్యాధి..

భారత్‌లో ఊబకాయం, మధుమేహం, ఇతర మెటబాలిక్ సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ఫ్యాటీ లివర్ వ్యాధిని ఇప్పుడు కేవలం కాలేయానికి సంబంధించిన సమస్యగా లేదా పెద్ద నగరాల్లో మాత్రమే కనిపించే అనారోగ్యంగా భావించలేం. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఈ సమస్య వేగంగా పెరుగుతోంది. ముఖ్యంగా చాలా మందిలో ఎలాంటి స్పష్టమైన లక్షణాలు కనిపించకుండానే ఈ వ్యాధి అభివృద్ధి చెందుతుండటంతో, ముందస్తు గుర్తింపు, స్క్రీనింగ్ మరింత కీలకంగా మారాయి. ఫ్యాటీ లివర్ వ్యాధిని ప్రస్తుతం మెటబాలిక్ డిస్‌ఫంక్షన్-అసోసియేటెడ్ స్టియాటోటిక్ లివర్ డిసీజ్ (ఎంఏఎస్ఎల్‌డీ)గా పిలుస్తున్నారు. ఈ వ్యాధి అధికంగా మద్యం తీసుకునే వారికే వస్తుందనుకోవడం తప్పు. ఊబకాయం, టైప్-2 మధుమేహం, అధిక కొలెస్ట్రాల్ వంటి సాధారణ ఆరోగ్య సమస్యలతో కూడా ఇది బలమైన సంబంధం కలిగి ఉంటుంది. దేశంలో ఈ పరిస్థితులు పెరుగుతుండటంతో ఫ్యాటీ లివర్ సమస్య కూడా ఎక్కువవుతోంది. ప్రస్తుతం ప్రతి ముగ్గురిలో ఒకరికి ఫ్యాటీ లివర్ ఉండే అవకాశం ఉందని పరిశోధనలు తెలియజేస్తున్నాయి.

ఎలాంటి లక్షణాలు ఉంటాయి..

ఎంఏఎస్ఎల్‌డీ సాధారణంగా చాలా సంవత్సరాల పాటు నెమ్మదిగా అభివృద్ధి చెందుతుంది. ప్రారంభ దశలో ప్రత్యేకమైన లక్షణాలు కనిపించకపోవడంతో చాలామందికి తమకు ఈ సమస్య ఉన్న విషయం తెలియదు. సాధారణ ఆరోగ్య పరీక్షలు లేదా ఇతర కారణాలతో వైద్య పరీక్షలు చేయించుకున్న సమయంలోనే కాలేయంలో మార్పులు బయటపడుతున్నాయి. అయితే చికిత్స లేకుండా వ్యాధి కొనసాగితే కాలేయంలో వాపు, మచ్చలు ఏర్పడటం, సిరోసిస్, కాలేయ వైఫల్యం, కాలేయ క్యాన్సర్ వంటి తీవ్రమైన సమస్యలకు దారితీస్తుంది. కొన్ని సందర్భాల్లో కాలేయ మార్పిడి అవసరమయ్యే పరిస్థితి కూడా వచ్చే అవకాశం ఉంటుంది. ఫ్యాటీ



లివర్ ప్రాధాన్యత కేవలం కాలేయానికి కలిగించే నష్టంతోనే పరిమితం కాదు. ఇది మధుమేహం, గుండె జబ్బులు, మెటబాలిక్ వ్యాధుల కారణంగా చిన్న వయసులోనే మరణించే ప్రమాదం పెరగడానికి కూడా ఒక సూచికగా ఉంటుంది.

వ్యాధి ముదిరిన తర్వాత అవసరమయ్యే దీర్ఘకాలిక వైద్యం, పర్యవేక్షణ రోగులతో పాటు వారి కుటుంబాలపై ఆర్థికంగా, మానసికంగా కూడా గణనీయమైన భారాన్ని మోపుతుంది.

# లివర్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే కాఫీ

ప్రతిరోజూ ఉదయం చాలామందికి కాఫీతోనే రోజు మొదలవుతుంది. నిద్రమత్తును తొలగించి చురుకుదనం పెంచే కాఫీకి మరో ప్రయోజనం కూడా ఉంటుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. కాఫీని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కొన్ని కాలేయ సంబంధిత వ్యాధుల ముప్పు తగ్గే అవకాశం ఉందని అధ్యయనాలు వెల్లడించాయి. అయితే కాఫీ ఎంత మోతాదులో తీసుకోవాలి, దాని ప్రయోజనాలు కేవలం కెఫైన్ వల్లేనా అనే అంశాలపై కూడా పరిశోధనలు జరిగాయి. శరీరంలో కాలేయం కీలకమైన పాత్ర పోషిస్తుంది. ఆహారం ద్వారా లభించే పోషకాలను ప్రాసెస్ చేయడం, శరీరంలోని వ్యర్థాలను తొలగించడం, అనేక ముఖ్యమైన శారీరక విధులను నిర్వహించడం వంటి పనులను కాలేయం చేస్తుంది. ఆహారం, వ్యాయామం, మద్యం తీసుకునే అలవాటు వంటి జీవనశైలి అంశాలు కాలేయ ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. ఈ నేపథ్యంలో కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో కాఫీకి ఏమైనా పాత్ర ఉందా అనే విషయంపై పరిశోధకులు దృష్టి సారించారు.

**భారీగా తగ్గిన లివర్ వ్యాధుల ప్రమాదం..**

దాదాపు 5 లక్షల మందిపై నిర్వహించిన ఒక అధ్యయనాన్ని పరిశీలించగా, కాఫీ తాగని వారితో పోలిస్తే కాఫీ తాగే వారిలో దీర్ఘకాలిక కాలేయ వ్యాధులతో మరణించే ప్రమాదం 49 శాతం తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. అదేవిధంగా 4.32 లక్షల మందికి పైగా పాల్గొన్న పలు అధ్యయనాల సమీక్షలో రోజుకు అదనంగా రెండు కప్పుల కాఫీ



తీసుకోవడం సిరోసిస్ ముప్పు 44 శాతం తక్కువగా ఉండటంతో సంబంధం ఉన్నట్లు తేలింది. సిరోసిస్ అనేది కాలేయ కణజాలం దెబ్బతిని, కాలేయం సాధారణంగా పనిచేయడాన్ని ప్రభావితం చేసే తీవ్రమైన పరిస్థితి. కాలేయ క్యాన్సర్‌లో అత్యంత సాధారణమైన ప్రాథమిక రకం అయిన హెపటోసెల్యులార్ కార్సినోమా (హెచ్‌సీసీ)పై కూడా కాఫీ ప్రభావాన్ని పరిశోధించారు. 22 లక్షల మందికి పైగా పాల్గొన్న అధ్యయనాల మెటా-అనాలిసిస్‌లో రోజుకు అదనంగా రెండు కప్పుల కాఫీ తాగడం వల్ల ఈ రకమైన కాలేయ క్యాన్సర్ వచ్చే ప్రమాదం 35 శాతం తక్కువగా ఉండటంతో సంబంధం ఉన్నట్లు గుర్తించారు.

**కేవలం కెఫైన్ మాత్రమే కాదు..**

కాఫీలో ఉండే ప్రయోజనాలు కేవలం కెఫైన్ వల్లే కావని పరిశోధనలు చెబుతున్నాయి. కెఫైన్ ఉన్న కాఫీతో పాటు డీక్యాఫినేటెడ్ కాఫీ కూడా మెరుగైన కాలేయ ఆరోగ్య ఫలితాలతో సంబంధం కలిగి ఉన్నట్లు కొన్ని అధ్యయనాల్లో కనిపించింది. దీనిని బట్టి కాఫీలో సహజంగా ఉండే ఇతర సమ్మేళనాలు కూడా కాలేయానికి ప్రయోజనం కలిగించడంలో కీలకపాత్ర పోషించే అవకాశం ఉందని అంటున్నారు. రోజుకు 3 నుంచి 4 కప్పుల కాఫీ తీసుకునే వారిలో కాలేయానికి సంబంధించిన కొన్ని మెరుగైన ఫలితాలతో బలమైన సంబంధం ఉన్నట్లు ఒక విస్తృత యూకే అధ్యయనం సూచించింది. అయితే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రోజుకు 3 లేదా 4 కప్పుల కాఫీ తాగాల్సిన అవసరం లేదని నిపుణుల అభిప్రాయం. వ్యక్తిగతంగా కాఫీని ఎంతవరకు తట్టుకోగలరనే అంశం కూడా ముఖ్యమే.

అంతేకాకుండా కాఫీలో అధికంగా చక్కెర లేదా క్రీమ్ కలిపి తీసుకుంటే దాని మొత్తం పోషక విలువ మారుతుంది. అందువల్ల కాలేయ ఆరోగ్యం కోసం కాఫీపై మాత్రమే ఆధారపడకుండా, సమతుల్య ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, ఆరోగ్యకరమైన బరువు, మద్యం వినియోగాన్ని నియంత్రించడం వంటి జీవనశైలి అలవాట్లపై కూడా దృష్టి పెట్టడం ముఖ్యం. ఉదయం తాగే ఒక కప్పు కాఫీ కేవలం నిద్రమత్తును తొలగించడానికే కాకుండా కాలేయ ఆరోగ్యంతోనూ సంబంధం కలిగి ఉంటుందని ఈ పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే కాఫీ తీసుకోవడం వల్ల కాలేయ వ్యాధులను పూర్తిగా నివారించవచ్చని అర్థం కాదు. వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులు, కాఫీకి శరీరం స్పందించే విధానం, తీసుకునే మోతాదు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.



# 200 కోట్ల క్లబ్‌లో రవితేజ 'ఇరుముడి'

మాస్ మహారాజ్ రవితేజ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఇరుముడి'. శివ నిర్వాణ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించింది. ఈ చిత్రం విడుదలైన తొలి రోజు నుంచే హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఫలితంగా ఈ చిత్రం రూ.200 కోట్ల వసూళ్లను రాబట్టినట్టు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. అయితే, ఈ చిత్రం ఇంతటి భారీ విజయానికి గల కారణాలను పరిశీలిస్తే, ఎక్కువగా మాస్ యాంగిల్‌లో కనిపించే రవితేజ ఇందులో భిన్నమైన పాత్రలో కనిపించారు. సాధారణ మధ్యతరగతి తండ్రి (త్రినాథ్)గా కనిపించారు. కూతురి ప్రేమకోసం పరితపించే తండ్రిగా భావోద్వేగభరితమైన నటనతో ఆకట్టుకున్నారు. ఆయన అభినయం విమర్శకుల ప్రశంసలు అందుకుంది. తెలుగు ప్రజలకు, ముఖ్యంగా అయ్యప్ప స్వామి భక్తులకు బాగా తెలిసిన ఇరుముడి దీక్ష గురించి ఈ సినిమాలో చూపించారు. ఈ అంశం ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయింది. తన ప్రాణమైన కూతురు మణెమ్మ (బేబీ నక్షత్ర) కోసం రవితేజ 41 రోజుల అయ్యప్ప దీక్షను స్వీకరిస్తారు. ఆ దీక్ష ఆయన జీవితాన్ని ఎలా మార్చిందనేది కథలో కీలకమైన అంశం. ఈ రెండు అంశాలకు తోడు సెంటిమెంట్‌తో పాటు ఊహించని మలుపులు, క్లైమాక్స్ ట్విస్ట్ ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేశాయి. ఇది కూడా సినిమా విజయానికి ఓ కారణంగా చెప్పొచ్చు. అలాగే, ఓ తండ్రిగా తన కూతురిపై ప్రేమ చూపించడమే కాదు, సమాజంలో అమ్మాయిలకు జరిగే అన్యాయాలకు వ్యతిరేకంగా హీరో పోరాటం చేయడం కూడా ప్రేక్షకులను కదిలించింది.

# తమన్నాకి ఆ హీరో ప్రపోజ్ చేసాడా?



మిల్కీబ్యూటీ తమన్నా భాటియా ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకెళ్తున్నారు. ప్రధానంగా తన ఫోకస్‌ను హిందీ చిత్ర పరిశ్రమపైనే పెట్టారు. ఐటెం సాంగ్స్‌తో పాటు హీరోయిన్‌గానూ ఆమెకు అవకాశాలు క్యూకడుతున్నాయి. విజయ్ వర్మతో బ్రేకప్ తర్వాత కెరీర్, వ్యాపారాలపై సరికొత్త ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇదిలాఉండగా ఓ స్టార్ హీరో వేదిక మీదే తమన్నాకు ప్రపోజ్ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. లస్ట్ స్టోరీస్ 2 సమయంలో తన సహనటుడు విజయ్ వర్మతో తమన్నాకి ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఇద్దరూ కొన్నాళ్లు సీక్రెట్‌గా డేటింగ్ చేశారు. సినిమా ఫంక్షన్లు, ఈవెంట్స్, విహారయాత్రలతో తమన్నా - విజయ్ హల్‌చల్ చేశారు. కానీ ఎక్కడా కూడా తమ బంధాన్ని బయటపెట్టలేదు. ఆ తర్వాత నెమ్మదిగా ఇద్దరూ ఓపెన్ అయ్యారు. రేపో మాపో పెళ్లి అనుకుంటుండగా తమన్నా - విజయ్ వర్మలు అనూహ్యంగా విడిపోయారు. వీరి మధ్య బ్రేకప్‌కు దారి తీసిన కారణాలు ఏంటన్నది మాత్రం తెలియరాలేదు. కెరీర్‌లో నిలదొక్కుకోవాలని విజయ్ వర్మ.. పెళ్లి చేసుకుని జీవితంలో స్థిరపడాలని తమన్నా నిర్ణయించుకోవడమే ఇందుకు ప్రధాన కారణంగా బాలీవుడ్ మీడియా కోడై కూసింది. బ్రేకప్ తర్వాత తమన్నా- విజయ్‌లు వారి జీవితాల్లో బిజీ అయ్యారు. సినిమాలు, షూటింగ్స్, బిజినెస్ ఇతర వ్యవహారాల్లో తలమునకలయ్యారు. ఈ బాధ నుంచి బయటకు రావడానికి సినిమాలను పెంచారు తమన్నా. అలాగే ఇప్పటి వరకు గ్లామరస్ రోల్స్ చేసిన నో కిస్ రూల్‌ను పక్కాగా ఫాలో అయిన ఈ ముద్దుగుమ్మ.. ఈ నిబంధనను కూడా పక్కనపెట్టారు. ఇంటిమేట్ సీన్స్, బెడ్ సీన్స్‌లో నటించేందుకు ఎలాంటి అభ్యంతరం లేదన్నట్లుగా సంకేతాలు ఇచ్చారు. దీనికి తగినట్లుగానే రాగిణి ఎంఎంఎస్ 3 వంటి బోల్డ్ సినిమాలో నటించేందుకు అగ్రిమెంట్ మీద సంతకం చేసింది.

# మంచిగా ఉందామన్నా బతకనివ్వడం లేదు



సాధారణ డిస్ట్రిబ్యూటర్‌గా కెరీర్ ప్రారంభించి.. నిర్మాతగా మారి ప్రస్తుతం టాలీవుడ్‌తో పాటు భారతీయ సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు దిల్‌రాజు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై 60కి పైగా సినిమాలు చేయడంతో పాటు ఎందరో హీరోలను, హీరోయిన్లను, దర్శకులను, ఇతర టెక్నీషియన్లను వెండితెరకు పరిచయం చేశారు రాజుగారు. దిల్‌రాజు బ్యానర్ నుంచి సినిమా వస్తుందంటే ఖచ్చితంగా దానిలో విశేషం ఉంటుందని ప్రేక్షకులు నమ్ముతారంటే చిత్ర పరిశ్రమపై ఆయన ఎలాంటి ముద్రవేశారో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. తెలుగు చిత్ర పరిశ్రమను శాసించే వ్యక్తుల్లో ఒకరిగా.. నైజాం కింగ్‌గా అభిమానులను దిల్‌రాజును పిలుచుకుంటారు. ఆయన మాటలు, చేతలు ఖచ్చితంగా ఇండస్ట్రీపై తీవ్ర ప్రభావం చూపుతాయి. దిల్‌రాజు ఓ ప్రాజెక్ట్ డీల్ చేస్తున్నారంటే ఖచ్చితంగా ఎన్నో లెక్కలు వేసుకుంటారని, ఆయన జడ్జిమెంట్ తప్పదని ఇండస్ట్రీ జనాల నమ్మకం. ఒక సినిమా రష్ చూసి అది ఎన్ని రోజులు ఆడుతుంది? ఎంత వసూలు చేస్తుంది? అనేది లెక్కలతో సహా చెప్పగల మేధావి దిల్‌రాజు. గత కొన్నేళ్ల వరకు ఆయన పట్టిందల్లా బంగారం అన్నట్లుగా సాగింది. స్టార్స్‌తో సినిమాలు తీసినా.. కొత్త వారిని పరిచయం చేసినా భారీ వసూళ్లతో బ్రాండ్ సొంతం చేసుకున్నారు దిల్‌రాజు. అయితే కొద్దికాలంగా రాజుగారి లెక్కలు తప్పుతున్నాయి. సినిమాల నిర్మాణంతో పాటు డిస్ట్రిబ్యూషన్ పరంగానూ భారీ నష్టాలు మూటకట్టుకుంటున్నారు. ఇటీవల టాక్సిక్ మూవీ ఆంధ్రా- నైజాం రైట్స్‌ని ఏకంగా 100 కోట్లకు పైగా వెచ్చించి సొంతం చేసుకున్నారు దిల్‌రాజు. యశ్ నటించిన ఈ సినిమా తొలిరోజు నుంచే డివైడ్ టాక్ తెచ్చుకుంది. సినిమాలు, డిస్ట్రిబ్యూషన్ మాత్రమే కాదు.. తన సామ్రాజ్యంగా చెప్పుకునే నైజాంలోకి బడా నిర్మాతలు అడుగుపెట్టడంతో ఆయన కోట బీటలు వారుతోంది.

# 'ఎపిక్ -- ఫస్ట్ సెమిస్టర్' ట్రైలర్ రిలీజ్




'బేబీ' మూవీ సక్సెస్ తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా రాబోతున్న కొత్త సినిమా 'ఎపిక్ -- ఫస్ట్ సెమిస్టర్'. ఈ యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ కి ఆదిత్య హాసన్ దర్శకత్వం వహిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై ఎస్. నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 11న ఈ మూవీ రిలీజ్ కానున్న నేపథ్యంలో తాజాగా చిత్ర ట్రైలర్ రిలీజ్ చేసి సినిమాపై అంచనాలు పెంచారు.

# డెలులు' సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి




ప్రస్తుతం యువతలో బాగా ట్రెండ్ అవుతున్న 'డెలులు' అనే పదమే టైటిల్‌గా తెరకెక్కుతున్న చిత్రం 'డెలులు'. క్రియేటివ్ లాంచ్‌ప్యాడ్ బ్యానర్‌పై సంకీర్త్ కొండ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ప్రీతం కస్తూరి దర్శకత్వం వహిస్తున్నారు. విజయ్ రాజ్‌కుమార్ కథ, అదనపు సంభాషణలు అందించగా.. రెష్మిత్ ఎస్. కౌశిక స్క్రీన్‌ప్లే, సంభాషణలు రాశారు. టైటిల్ నుంచే విభిన్నంగా అనిపిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. యువతరం నటీనటులతో తెరకెక్కుతున్న 'డెలులు' మూవీ టీజర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఒక నిమిషం 32 సెకండ్ల నిడివి ఉన్న ఈ టీజర్.. 'బ్రేకప్ దేవా' అనే డైలాగ్‌తో ప్రారంభమవుతుంది. ఆ తర్వాత వచ్చే సన్నివేశాలు, పాత్రల మధ్య జరిగే సరదా సంభాషణలు టీజర్‌కు మంచి ఫన్ టచ్‌ను తీసుకొచ్చాయి. టీజర్‌లోని పలు డైలాగ్స్ ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. 'ఆడదానివైన నువ్వు.. చీప్‌గా ఓ మగాడి కోసం మారతావా అంటావా.. సెల్ఫ్ రెస్పెక్ట్ లేదా నీకు', 'నువేమైనా ఫాదర్ ఆఫ్ ఇండియానా?', 'నువ్వు అత్తాపూర్‌కు రారా.. నీళ్ల ట్యాంకర్ దగ్గర ఆడోళ్లతో కొట్టిస్తా', 'కుక్కకు పుట్టినవా నువ్వు' వంటి డైలాగ్స్ టీజర్‌లో హైలైట్‌గా నిలిచాయి. ఈ డైలాగ్స్, కామెడీ సన్నివేశాలు సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచుతున్నాయి. ముఖ్యంగా ఓ ఇంటి నేపథ్యంలో చోటుచేసుకునే సరదా సంఘటనలు, పాత్రల మధ్య కెమిస్ట్రీ టీజర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. కామెడీతో పాటు కుటుంబ ప్రేక్షకులను అలరించే అంశాలకు కూడా సినిమాలో ప్రాధాన్యత ఇచ్చినట్లు టీజర్ చూస్తే అర్థమవుతోంది. మొత్తంగా టీజర్ ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతూ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించేలా ఉంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్‌కు మంచి స్పందన రాగా.. తాజాగా వచ్చిన టీజర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. సాంకేతికంగా కూడా 'డెలులు'కు మంచి బృందం పనిచేస్తోంది. జై రాజ్ నాయుడు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా.. హరికృష్ణ కురపాటి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆది చెబ్రోలు సంగీతం అందిస్తున్నారు. టీజర్‌లో సంగీతం కూడా సన్నివేశాలకు తగ్గట్టుగా ఆకట్టుకుంటోంది.